సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
మంగళవారం, 10.02.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 110
పేజీలు: 12 వెల: రూ. 5


## అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా?

### రష్యా నుంచి తగ్గిన ఆయిల్ దిగుమతి



- వాణిజ్య ఒప్పందం కుదిరగానే రష్యా దిగుమతుల్లో ఒక్క నెలలోనే కోత
- టారిఫ్ రాయితీల ప్రతిఫలమా? ట్రంప్ ప్రకటనలు గణాంకాలకు సరిపోతున్నాయి
- రష్యా వాటా పతనం.. భారత ఆయిల్ దిగుమతుల్లో 34% నుంచి 24.9%కి తగ్గుదల
- అమెరికా ఆయిల్ దూకుడు – ఏడాదిలోనే దిగుమతులు 31% పెరిగాయి

02

## రేవంత్ రెడ్డి జైలుకెళ్లే టైం దగ్గరకొచ్చింది

### మాజీ మంత్రి హరీష్ రావు



- ఆయన ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ
- సాక్ష్యాలు ఉండకూడదని ఫోరెన్సిక్ ల్యాబ్‌ను తగలబెట్టిండు
- ప్రమాదవశాత్తు జరిగిందని నమ్మించే ప్రయత్నం చేస్తున్నడు

03

## పురపోరులో

# కీలక పర్వం

- రేపు ఉదయం నుంచి పోలింగ్
- మున్సిపల్ ఫలితాలు.. రాష్ట్ర రాజకీయాలకు దిక్సూచి
- 2028 అసెంబ్లీకి సెమీ ఫైనల్‌గా మారిన పట్టణ పోరు
- హస్తం–కారు–కమలం మధ్య ప్రతిష్టాత్మక సమరం
- పట్టణ ఓటరే తేల్చబోయే రాజకీయ భవితవ్యం
- ఆరు గ్యారెంటీలపై ఓటర్ల తీర్పు
- పుంజుకోవాలనుకుంటున్న బీఆర్ఎస్‌కు ఇది పరీక్ష
- ఉత్తర తెలంగాణలో బీజేపీ గట్టి అంచనాలు
- గల్లీ ప్రచారానికి తెర.. డిజిటల్ వార్‌కు తెరలేచింది
- స్మార్ట్‌ఫోన్ ఓటరు.. వైరల్ కంటెంట్ తీర్పు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. ఈ ప్రచారంలో మాటలు కోటలు దాటాయి. సమస్యలు ఢిల్లీ కి ఎగబాకాయి. మున్సిపోల్స్ ఫలితాలతో రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులు ఖాయమనే సంకేతాలు వస్తు న్నాయి. ఈ ఎన్నికల్లో వెనుకబడిన వారికి గడ్డు కాలమే అన్నట్టుగా పరిస్థితి మారింది. ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలు కేవలం పట్టణ పరిపాలన కోసమే కాదు, 2028 అసెంబ్లీ ఎన్నికలకు పునాదిగా, రాబోయే పంచాయతీ ఎన్నికలకు రిహార్సల్స్‌గా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో జరుగుతున్న ఈ పోరు ఇప్పుడు హస్తం వర్సెస్ కారు మధ్య అత్యంత ప్రతిష్టాత్మకమైన 'సెమీ ఫైనల్'గా మారింది.

**పట్టు నిలుపుకునే పంతంలో కాంగ్రెస్**

అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయం గాలివాటం కాదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఉంది. ఇటీవలే ముగిసిన పంచాయతీ ఎన్నికల తొలి రెండు దశల్లో కాంగ్రెస్ మద్దతుదారులు సుమారు 4,000కు పైగా సర్పంచ్ స్థానాలను గెలుచుకుని జోరు మీదున్నారు. అదే ఊపును మున్సిపాలిటీల్లో నూ కొనసాగించి, పట్టణ ఓటర్లు కూడా తమవైపే ఉన్నారని చాటిచెప్పాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇందుకోసం మంత్రులను పార్లమెంటరీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులుగా నియమించి క్షేత్రస్థాయిలో వ్యూహాలు రచిస్తోంది.

మిగతా 02లో

## భారత్ మ్యాచ్‌పై

# పాక్ కండిషన్లు

### ఐసీసీకి పీసీబీ మూడు డిమాండ్లు!

టీ20 ప్రపంచ కప్

- బంగ్లా బోర్డుకు ఆర్థిక సాయం పెంచాలి
- బహిష్కరించినా పార్టిసిపేషన్ ఫీజు ఇవ్వాల్సిందే
- ఒక టోర్నమెంట్ కు ఆతిథ్య హక్కులు ఇవ్వాలి

11



## పసికూనల పోరులో విజేతలు

### ఇటలీపై స్కాట్లాండ్ ఘన విజయం

- ఓమన్ ను చిత్తుచేసిన జింబాబ్వే..
- కెనడాను ఓడించిన సౌత్ ఆఫ్రికా



*టీ20 ప్రపంచ కప్‌లో పసికూన జట్లపై అనుభవజ్ఞులైన జట్లు తమ అసలైన సత్తాను చాటుకున్నాయి. సోమవారం జరిగిన మ్యాచుల్లో ప్రత్యర్థులపై స్కాట్లాండ్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా జట్లు తమ తమ మ్యాచ్‌ల్లో ఏకపక్ష విజయాలు సాధిస్తూ టోర్నీలో ఆధిపత్యాన్ని మరింత బలపరిచాయి.*

## చెల్లని నోట్లు ఇస్తారు జాగ్రత్త

### ఓటు కోసం కాంగ్రెస్ తెగిస్తుంది

డబ్బులు తీసుకోండి.. ఓటు మాత్రం బీఆర్ఎస్‌కే వేయండి : కేటీఆర్

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 'దండుపాళ్యం బ్యాచ్'లా వ్యవహరిస్తోంది
- ఆరు గ్యారెంటీలు గాలికొదిలి ప్రజలను ముంచిన కాంగ్రెస్

09



## కవిత జైలుకెళ్తే.. హరీశ్, కేటీఆర్

# సీఎం కావాలని చూస్తున్నారు

### విలేకరుల ఇష్టాగోష్టిలో రేవంత్ రెడ్డి



- బీఆర్ఎస్‌లో సీఎం పదవిపై అంతర్గత పోరు ఉంది
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలకంగా ప్రభాకర్ రావు పాత్ర
- సుప్రీంకోర్టు ఆదేశాలతోనే విచారణ వేగవంతం
- లడ్డూ కల్తీ ఏపీ అంశమేనని స్పష్టం

02

## చిగురుటాకులకు

# గర్భశోకం

### టీనేజీలోనే తల్లులవుతున్నారు

09

- ఆందోళన కలిగిస్తున్న బాల్య గర్భాలు
- రాష్ట్ర సగటు 8.8%.. కుప్పంలో అత్యధికంగా టీనేజీ ప్రెగ్నెన్సీలు
- 16–18 ఏళ్ల గర్భధారణ ప్రాణాలకే ముప్పు: వైద్యుల హెచ్చరిక
- రెడ్, ఆరెంజ్ జోన్లుగా జిల్లాలు.. విశాఖలో తక్కువ నమోదు
- 2026–27కి 5% టార్గెట్.. అవగాహనపై ప్రభుత్వం ఫోకస్



*ఆటపాటల మధ్య చిలకమ్మ పెళ్లిళ్లు.. ఆపై పచ్చని బాల్యంపై గర్భశోకం! ఆంధ్రప్రదేశ్‌లో టీనేజీ తల్లుల సంఖ్య ఆందోళనకర రీతిలో పెరుగుతోంది. విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన వయసులో, శారీరక పరిణతి రాకముందే వేలాది మంది యువతులు మాతృత్వపు భారంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సగటున 8.8 శాతం మంది టీనేజీ యువతులు గర్భం దాల్చుతున్నట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తుండగా ఒక్క కుప్పం నియోజకవర్గంలోనే ఇది 14.9 శాతానికి చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పసివయసులోనే ప్రసూతి కష్టాలను ఎదుర్కొంటూ, తల్లీబిడ్డల ప్రాణాలను పణంగా పెడుతున్న ఈ 'బాల్య గర్భాల' వెనుక ఉన్న సామాజిక కుతంత్రాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేస్తోంది."*

## సేవ్ తెలంగాణ

### ఓట్ ఫర్ బీజేపీ

**కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు**

- పొరపాటు చేస్తే మళ్లీ ఐదేళ్లపాటు నరక యాతన తప్పదు
- మున్సిపాలిటీ ఎన్నికల తీర్పు.. కాంగ్రెస్ కు కావాలి గుణపాఠం
- కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చే బాధ్యత నాది

03



## గల్లీ మోరీతో ఢిల్లీ మోడీకి

# ఏం సంబంధం

### తెలంగాణకు ప్రధాని చేసిందేమీ లేదు

- బీజేపీ, బీఆర్ఎస్ కు ఓట్లు అడిగే హక్కు లేదు
- అధ్వాన్న దుస్థితికి బీఆర్ఎస్ పాలనే కారణం
- బీజేపీ మొత్తం ఓవైసీ నామజపం
- ఓటేస్తే.. అభివృద్ధి బాధ్యత నాదే సీఎం రేవంత్ రెడ్డి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొందని సీఎం రేవంత్‌రెడ్డి, పట్టణ ఓటర్లు భవిష్యత్తును ఆలోచించుకొని ఓటు వేయాలని సీఎం రేవంత్ ప్రజలను కోరారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ.. పదేండ్లు రాష్ట్రంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలను నిండా మోసం చేశాయని మండిపడ్డారు. బీజేపీ తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా? అని ప్రశ్నించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పాలమూరు–రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని ప్రధాని మోడీనే స్వయంగా హామీ ఇచ్చారని, కానీ, హామీ మరిచిపోయారన్నారు. ఇచ్చిన హామీల గురించి చెప్పట్లేదని, కానీ, మోడీని చూసి ఓటేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారని, గల్లీ ఎన్నికలతో ఢిల్లీ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గల్లీలో మోరీ నిండితే ఢిల్లీలోని మోడీకి చెప్తే క్లీన్ చేస్తారా అని సీఎం సెటైర్లు వేశారు. హైదరాబాద్‌లో గతంలో వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి తిరిగిస్తామని గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ హామీ ఇచ్చారని, బండి పోతే బండి.. ఇంట్ల సామాను పోతే సామాను ఇస్తామన్న హామీని నమ్మి ఆ పార్టీకి చెందిన 50 మందిని కార్పొరేటర్లుగా గెలిపించా

మిగతా 02లో

- తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ విద్యార్థులతో ప్రధాని మోదీ సంభాషణ
- నాయకత్వం అంటే సేవ
- ఏఐకి భయపడొద్దు.. టెక్నాలజీని అర్థం చేసుకోండి
- క్రమశిక్షణ లేకుండా ప్రేరణ పనికిరాదు
- చిన్నగా స్టార్టప్ ప్రారంభించవచ్చు: ప్రధాని పరీక్షల ఒత్తిడికి నిద్ర, క్రీడలు కీలకం

## పరీక్షా పే చర్చలో

# మోదీ మంత్రం

09

### నాయకత్వం నుంచి ఏఐ వరకూ విద్యార్థులకు దిశానిర్దేశం



## 11వ తేదీ తర్వాత మీ సంగతి తేలుస్తా

### పోలింగ్ ముగిసిన వెంటనే హద్దులు దాటినవారిపై చర్యలు



- బెదిరింపులు, దందాలకు తావులేదని స్పష్టం
- కారుకూతలు కూస్తే చట్టరీత్యా ఉక్కుపాదం
- ఎన్నికలతో దౌర్జన్యాలకు ఫుల్ స్టాప్
- అభివృద్ధి చేయగలది అధికారంలో ఉన్న ప్రభుత్వమే
- ఏదులాపురాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

09

ముద్ర

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. నేటితో ప్రచార గడువు ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా మైకులు మూగబోయాయి.



### ఆరోగ్యానికి మేలు చేసే పండ్లు
**ఆపిల్**



రోజు ఆపిల్ తింటే జీర్ణక్రియ మెరుగవుతుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో ఇది సహాయపడుతుంది.

# పురపోరు.. కీలక పర్వం

**(మొదటి పేజీ తరువాయి)**

**పుంజుకోవాలని ఆరాటపడుతున్న బీఆర్ఎస్**

అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత కుంగుబాటులో ఉన్న బీఆర్ఎస్, ఈ మున్సిపల్ ఎన్నికలను పునర్వైభవానికి మార్గంగా చూస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో దాదాపు 1,800 స్థానాలను గెలుచుకుని తాము ఇంకా క్షేత్రస్థాయిలో బలంగానే ఉన్నామని కేడర్‌లో ధైర్యాన్ని నింపింది. పట్టణ ప్రాంతాల్లో కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోతే పార్టీ మనుగడ ప్రశ్నార్థకమవుతుందనే ఆందోళన గులాబీ శ్రేణుల్లో కనిపిస్తోంది.

**ఆరు గ్యారెంటీలు - గెలుపు గుర్రాలా?**

మున్సిపల్ ఓటర్ల తీర్పులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆరు గ్యారెంటీలు' కీలక పాత్ర పోషించనున్నాయి. ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి వంటి పథకాల లబ్ధిదారులు పట్టణాల్లోనే ఎక్కువగా ఉన్నారు. అయితే, రుణమాఫీ అమలులో జాప్యం, రైతు భరోసాపై సందిగ్ధతను బీఆర్ఎస్ అస్త్రంగా మలచుకుంటోంది. ఈ పథకాల వల్ల తమ జీవితాల్లో మార్పు వచ్చిందని ఓటర్లు భావిస్తే కాంగ్రెస్ గెలుపు నల్లేరుపై నడకే, లేదంటే




'యాంటీ ఇంకంబెన్సీ' సెగ తగిలే అవకాశం ఉంది. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వచ్చే ఎన్నికలపై నేరుగా ప్రభావం చూపుతాయి.

**బీజేపీ కూడా గట్టి అంచనాలే పెట్టుకుంది!**

బీజేపీ ఈ మున్సిపల్ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు వ్యూహాలు రచిస్తోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణా జిల్లాల్లో ఆ పార్టీకి ఉన్న బలమైన ఓటు బ్యాంకు, ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో సాధించిన ఎంపీ స్థానాల ప్రభావం పట్టణ ఓటర్లపై బలంగా ఉంటుందని అంచనా వేస్తోంది. వికసిత్ తెలంగాణ బీజేపీ సంకల్ప పత్రం 2026 పేరుతో విడుదల చేసిన మేనిఫెస్టోలో ఆస్తి పన్నులు పెంచబోమని, అవినీతి రహిత పాలన అందిస్తామని ఇచ్చిన హామీలు మధ్యతరగతి ఓటర్లను ఆకట్టుకునేలా ఉన్నాయి. నిజామాబాద్, కరీంనగర్ వంటి నగరాలతో పాటు ఆదిలాబాద్, మహబూబ్ నగర్ వంటి ప్రాంతాల్లో బీజేపీకి గణనీయమైన విజయావకాశాలు ఉన్నాయని, కనీసం 30% వార్డుల్లో కాషాయ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. పట్టణ ఓటర్లలో పలుకుబడి నిలబెట్టుకున్న పార్టీలు మరింత ధైర్యంగా రాజకీయాలు చేయబోతున్నాయి. దెబ్బతిన్న పార్టీలు కొత్త వ్యూహాలతో ప్రయత్నాలు చేయాల్సిందే.

**ముగిసిన ప్రచారం**

మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ముగిసింది. కొద్దిరోజులుగా గల్లీల్లో వినిపించిన మైకుల హోరు, పార్టీల ప్రచార జోరుకు తెరపడింది. పోలింగ్‌కు కౌంట్‌డౌన్ షురూ అయింది. ఈ నెల 11న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటలవరకు 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరుగనుంది. 13న కౌంటింగ్ నిర్వహిస్తారు. మొత్తం 2,996 వార్డుల్లో జరుగుతున్న ఎన్నికల్లో 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 52 లక్షల మందిపైగా ఓటర్లు వీరి భవితవ్యాన్ని తేల్చనున్నారు. ఇందులో మహిళా ఓటర్లు 26 లక్షల మంది, పురుష ఓటర్లు 25 లక్షల మంది ఉన్నారు. ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఈ సారి రాష్ట్ర ఎన్నికల సంఘం అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8వేల 203 పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారానే జరుగుతుండటంతో, సుమారు 16వేల 301 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసి ఆయా కేంద్రాలకు పంపిణీ చేశారు. ఓటింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి, అక్కడ 24 గంటల పాటు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు 25,000 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,900 సమస్యాత్మక, 1,400 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ సీసీటీవీ మానిటరింగ్‌తో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మద్యం దుకాణాలను కూడా మూసివేశారు.

**డిజిటల్ వార్**

ఎన్నికలు ఏవైనా సోషల్ మీడియా ప్రభావాన్ని ఎవరూ కాదనలేరు. మున్సిపల్ ఎన్నికల్లో స్థానిక ఇన్ ఫ్లూయన్సర్లను రాజకీయ నేతలు వాడుకున్నారు. ఈ మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు కేవలం గల్లీల్లో తిరుగుతూ ఓట్లు అడిగే సంప్రదాయంతో పాటు ఇప్పుడు సోషల్ మీడియాను వాడేశారు. ప్రతి ఓటరు చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు ఒక పోలింగ్ బూత్ గా, ప్రతి వాట్సాప్ గ్రూపు ఒక ప్రచార సభ గా మారిపోయింది. ఈ డిజిటల్ విప్లవం స్థానిక సంస్థల ఎన్నికల్లో సరికొత్త పోకడలను తీసుకువచ్చింది. ఒకప్పుడు ఎన్నికల ప్రచారం అంటే మైకుల హోరు, గోడ పత్రికల హడావుడి ఉండేది. కానీ ఇప్పుడు అభ్యర్థులు తమ వార్డు పరిధిలో పాపులర్ అయిన లోకల్ ఇన్ఫ్లుయెన్సర్లు, యూట్యూబ్ ఛానళ్లపై ఆధారపడ్డారు. మన వార్డు అభ్యర్థి.. మన మనిషి అంటూ సాగే 60 సెకన్ల ఇన్‌స్టా రీల్స్ ఓటర్లపై బలమైన ముద్ర వేసినట్లుగా భావిస్తున్నారు. ముఖ్యంగా యువతను ఆకట్టుకోవడానికి సినిమా పాటల పేరడీలు, మాస్ డైలాగులతో అభ్యర్థులు తమను తాము హీరోలుగా ప్రొజెక్ట్ చేసుకున్నారు.

వాట్సాప్ వార్ రూమ్స్ – క్షణాల్లో వైరల్

ప్రతి వార్డుకు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు వెలిశాయి. అభ్యర్థులు డిజిటల్ వార్ రూమ్స్ ఏర్పాటు చేసుకుని పెయిడ్ వలంటీర్ల ద్వారా నిరంతరం మెసేజ్‌లు పంపిస్తున్నారు. వార్డులోని డ్రైనేజీ సమస్యలు, రోడ్ల పరిస్థితిపై ప్రత్యర్థి పార్టీల వైఫల్యాలను ఎండగడుతూ గ్రాఫిక్ కార్డ్స్, షార్ట్ వీడియోలను వైరల్ చేస్తున్నారు. ఇది ఎంత వేగంగా జరుగుతోందంటే, ప్రత్యర్థి ఒక విమర్శ చేసేలోపే దానికి కౌంటర్ వీడియో గ్రూపుల్లో ప్రత్యక్షమవుతోంది. ఈ ఎన్నికల్లో 'ట్రోలింగ్' అతిపెద్ద ఆయుధంగా మారింది. ప్రత్యర్థి అభ్యర్థి గతంలో వేరే పార్టీలో ఉన్నప్పుడు చేసిన ప్రసంగాలు, ఇచ్చిన హామీలు నెరవేర్చని వీడియోలను వెలికితీసి మీమ్స్ రూపంలో ప్రచారం చేస్తున్నారు. నాడు అలా.. నేడు ఇలా అంటూ అభ్యర్థుల ద్వంద్వ ప్రమాణాలను ఎండగట్టడం ఓటర్లలో గందరగోళాన్ని, చర్చను రేపుతోంది. వ్యక్తిగత విమర్శలు, మార్ఫింగ్ ఫోటోలు కూడా ఈ డిజిటల్ పోరులో భాగం కావడం ఆందోళన కలిగిస్తోంది.

**స్మార్ట్ ఫోన్ ఓటరు - మారుతున్న తీర్పు**

ఒకప్పుడు ఎన్నికల ముందు ఇచ్చే మద్యం, డబ్బు నాడిని నిర్ణయించేవి. కానీ ఇప్పుడు డిజిటల్ ప్రచారం ఓటరు ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తోంది. స్మార్ట్‌ఫోన్ చూస్తూ అభ్యర్థి వ్యక్తిత్వం, సామాజిక స్పందనను ఓటరు బేరీజు వేసుకుంటున్నాడు. ముఖ్యంగా అర్బన్ ఓటరు టీవీ వార్తల కంటే సోషల్ మీడియాలో వచ్చే వైరల్ కంటెంట్‌నే ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు విశ్లేషణలు చెబుతున్నాయి. ఇది సంప్రదాయ పార్టీల కంటే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న స్వతంత్ర అభ్యర్థులకు, చిన్న పార్టీలకు కలిసి వచ్చే అంశం.

**లోకల్ పోల్స్‌లోనూ తప్పని ఫేక్ న్యూస్ బెడద**

డిజిటల్ వార్‌లో ఉన్న ప్రధాన లోపం ఫేక్ న్యూస్. ప్రత్యర్థిపై బురద చల్లడానికి తప్పుడు వార్తలను సృష్టించి వైరల్ చేస్తున్నారు. ఎన్నికల సంఘం సోషల్ మీడియాపై నిఘా పెంచినా, లోకల్ వాట్సాప్ గ్రూపుల్లో జరిగే ప్రచారాన్ని అడ్డుకోవడం సవాల్‌గా మారింది. అభ్యర్థులు తమ ప్రచార ఖర్చులో దాదాపు 30–40 శాతం కేవలం డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ కోసమే వెచ్చిస్తుండటం ఈ డిజిటల్ దండయాత్ర తీవ్రతకు అద్దం పడుతోంది. గల్లీలో గెలవాలంటే ఇప్పుడు కేవలం గుమ్మం తొక్కితే సరిపోదు.. ఓటరు ఫోన్ స్క్రీన్‌పై నిరంతరం కనిపిస్తూ ఉండాలి. వైరల్ రాజకీయం ఎన్నికల ఫలితాలను ఎలా తారుమారు చేస్తుందో చూడాలి.

## గల్లీ మోరీతో ఢిల్లీ మోడీకి
# ఏం సంబంధం

**(మొదటి పేజీ తరువాయి)**

రన్నారు. ఎన్నికలయ్యాక అడిగితే.. వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారని, సత్రంలో భోజనానికి నెల్లూరు పెద్దారెడ్డి సిఫారసు లేఖ ఇచ్చినట్లుగా ఉందన్నారు.

**దక్షిణాదికి తీవ్ర అన్యాయం**

తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చామని బీజేపీ నేతలు చెబుతున్నారని, దీనిపై సీఎస్‌ను వివరణ అడిగితే.. మనం రూపాయి చెల్లిస్తే.. కేంద్రం 42 పైసలు ఇస్తోందని చెప్పారన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు భాజపా తీవ్ర అన్యాయం చేస్తోందని, బిహార్ ఒక్క రూపాయి పన్ను చెల్లిస్తే.. రూ.6.16 కేంద్రం ఇస్తోందని, తెలంగాణకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఏ రోజైనా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మనకు అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదని, మనం చెల్లించిన నిధులు తిరిగిస్తే చాలన్నారు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయని, కానీ ఈ రాష్ట్రాలకే అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణకు వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారని, హైదరాబాద్‌కు వచ్చిన సెమీకండక్టర్ ప్రాజెక్టును మోడీ ఒత్తిడి చేసి.. ఏపీకి తరలించారని, ఇప్పుడు మోడీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారన్నారు. అసలు మున్సిపల్ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం అని, బీజేపీ నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ అని, ఆయన పేరు లేకుండా ఆ నేతల ప్రచారం ఉండదన్నారు. మత రాజకీయాల ద్వారా బీజేపీ రాజకీయ మనుగడ సాగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**బీఆర్ఎస్ పాలనే కారణం**

మున్సిపాలిటీల్లో ఉన్న అనేక సమస్యలకు బీఆర్ఎస్ పాలనే కారణమని సీఎం పేర్కొన్నారు. కీలక పదవులు కేసీఆర్ కుటుంబం చేతిలోనే ఉండగా, పదేళ్ల పాటు మున్సిపల్ పాలన కూడా బీఆర్ఎస్ ఆధీనంలోనే సాగిందన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి మున్సిపాలిటీల అభివృద్ధిని పట్టించుకోలేదని బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు.

ఈ సందర్భంగా సీఎం చేసిన కొన్ని వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. మున్సిపాలిటీల్లో ఉన్న అనేక సమస్యలకు బీఆర్ఎస్ పాలనే కారణమని సీఎం పేర్కొన్నారు. కీలక పదవులు కేసీఆర్ కుటుంబం చేతిలోనే ఉండగా, పదేళ్ల పాటు మున్సిపల్ పాలన కూడా బీఆర్ఎస్ ఆధీనంలోనే సాగిందన్నారు. ఇన్నేళ్లలో పేదలకు రేషన్ కా



ర్డులు, ప్రాథమిక సాయం కూడా సరిగా అందలేదని విమర్శించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో వందల ఎకరాల భూముల కబ్జా ఆరోపణలను ప్రస్తావించిన రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్–బీజేపీ రెండూ ఒకటేనని, కేంద్ర బడ్జెట్ విషయంలో పరస్పరం మద్దతు ఇచ్చుకుంటున్నాయని ఆరోపించారు. ఇప్పుడు కొత్తగా ఇచ్చే హామీలను ప్రజలు ఎలా నమ్మాలని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు లక్షల కోట్ల నిధులు ఇచ్చామని చెబుతున్నా, అవి పన్నుల వాటాలో భాగమేనని, అందులోనూ దక్షిణ రాష్ట్రాలకు తీవ్ర వివక్ష జరుగుతోందని విమర్శించారు. ఈ విషయాలపై కేంద్ర మంత్రులు ప్రధాని మోదీని ఎందుకు ప్రశ్నించడంలేదని నిలదీశారు. ఈ ఎన్నికల్లో ప్రజలు వాస్తవాలను గమనించి సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఫోన్ ట్యాపింగ్ ద్వారా వందల కోట్లు వసూలు చేసిన ఉన్మాద పాలన వారిదని, విచారణకు పిలిస్తే ముసుగులు వేసుకుని తప్పించుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల అరెస్టు కాకుండా బీజేపీ వాళ్లను కాపాడుతోందని, యాసిడ్ పోసి కడిగితే తప్ప బీఆర్ఎస్ పట్టిన పీడ వదలదని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగబద్ధంగా వచ్చే నిధులను కూడా తామే తెచ్చామని గొప్పలు చెప్పుకోవడం అన్యాయం అన్నారు.

**ప్రజా సంక్షేమం మాది**

అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను రేవంత్ రెడ్డి ఏకరువు పెట్టారు. మొదటి తారీఖునే జీతాలు ఇవ్వడం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.9 వేల కోట్లు కేటాయించడం వంటి విజయాలను ప్రస్తావించారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు రుణమాఫీ చేశామని, 70 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని గుర్తు చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులతో తెలంగాణ భవిష్యత్తును మారుస్తున్నామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల తీర్పులో పన్నెండేళ్ల మోదీ పాలన, పదేళ్ల బీఆర్ఎస్ అరాచకం, యిరెండేళ్ల కాంగ్రెస్ ప్రజాపాలనను బేరీజు వేసుకోవాలని ఓటర్లను కోరారు. ఈ ప్రభుత్వం మీది.. మీ కోసం పనిచేస్తుంది. తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రంతో కొట్లాడడానికైనా సిద్ధం అని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. మరో ఎనిమిదేళ్ల పాటు తామే అధికారంలో ఉంటామని, అభివృద్ధి చేసే బాధ్యతను ముఖ్యమంత్రిగా, మున్సిపల్ మంత్రిగా తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# తుర్కియేకు భారత్ బాయికాట్ దెబ్బ

**ముద్ర, నేషనల్ డెస్క్:** తుర్కియే.. పర్యాటక దేశం. పర్యాటకరంగం ఆ దేశానికి ప్రధాన ఆదాయ వనరు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు వరకు తుర్కియేతో భారత్‌కు సత్సంబంధాలు ఉన్నాయి. భూకంప సమయంలో భారత్ పెద్ద ఎత్తున సాయం చేసింది. మన సైన్యాన్ని పంపించి వేల మంది ప్రాణాలు కాపాడింది. మందులు, వైద్య సేవలు అందించింది. కానీ, ఏమాత్రం కృతజ్ఞతలేని తుర్కియే ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ పంచన నిలచింది. సీజ్ ఫైర్ తర్వాత భారత మిత్రులు ఎవరో శత్రువులు ఎవరో క్లారిటీ వచ్చింది.

భారత్‌కు శత్రువుగా మారిన తుర్కియేను ఆర్థికంగా దెబ్బ కొట్టింది భారత్. దేశంలోని విమానాశ్రయాల నిర్వహణ ఒప్పందం రద్దు చేసింది. అనేక కీలక అగ్రిమెంట్లు క్యాన్సిల్ చేసింది. కాశ్మీర్ విషయంలో భారత సార్వభౌమత్వాన్ని సవాలు చేసిన ఆ దేశ అధ్యక్షుడు ఎర్దోగన్ వ్యాఖ్యలు, పాకిస్తాన్‌కు ఆయుధ సరఫరాతోభారత్ బాయికాట్ నినాదం అందుకుంది.

**టూరిజానికి పెద్ద దెబ్బ..**

భారత్ బాయికాట్ నినాదంతో తుర్కియేకు వెళ్లే పర్యాటకులు గణనీయంగా తగ్గిపోయారు. 2024లో భారత్ నుంచి 3.30 లక్షల మంది పర్యాటకులు తుర్కియే సందర్శించగా, 2025లో ఇది 2.5 లక్షలకు పడిపోయింది. 25 శాతం పర్యాటకులు టూర్ రద్దు చేసుకున్నారు. దీంతో టూర్ ప్యాకేజీలు, హోటల్స్ ఖాళీగా మిగిలాయి. సోషల్ మీడియాలో #Boy-cottTurkey ట్రెండ్‌తో ప్రజలు తమ ఆర్థిక శక్తిని ఆయుధంగా మలిచారు. ఇది టూరిజం ఆదాయాన్ని గణనీయంగా తగ్గించింది.

**ఉత్పత్తుల బాయ్‌కాట్..**

ఇదే సమయంలో భారతీయులు తుర్కీ ఆహార పదార్థాలు, వస్త్రాలు, ఇతర వస్తువులను కూడా నివారించారు. ఇది ఆత్మ నిర్భర్ భారత్ సందేశాన్ని ప్రపంచానికి చేరవేసింది. టర్కీ ఆర్థిక వ్యవస్థకు భారత మార్కెట్ కీలకమని ఇప్పుడు స్పష్టమైంది. ఒక్క టూరిజమే కాకుండా, వాణిజ్య రంగాలు కూడా క్షీణిస్తున్నాయి.

**ఆర్థిక శక్తి హెచ్చరిక**

ఈ బాయ్‌కాట్ భారత్ ఆర్థిక ప్రభావాన్ని ప్రదర్శిస్తుంది. సైనిక బలం మాత్రమే కాకుండా, ప్రజా కదలికలు, వినియోగ శక్తి ద్వారా దేశం తన హక్కులను కాపాడుకుంటుంది. తుర్కియేకు ఇది పాఠం. ఆ దేశంలో ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తుంది. రాజకీయ ఆకర్షణల కోసం ఆర్థిక సంబంధాలను బలవంతంగా మార్చకూడదు. భారత్ వంటి ఆర్థిక శక్తిసామర్థ్యం ఉన్న దేశాలతో స్నేహం ప్రయోజనకరం. లేకపోతే, ఇలాంటి బాయ్‌కాట్‌లు మరిన్ని దేశాలకు విస్తరించడం ఖాయం.



## హరీశ్, కేటీఆర్
## సీఎం అవుదామని చూస్తున్నారు



బీఆర్ఎస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఘాటుగా స్పందించారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. కవిత జైలుకు వెళ్తే సీఎం కావాలన్న ఆశతో హరీశ్ రావు, కేటీఆర్ ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు. మన ఇంటి బిడ్డను సరిగా చూసుకుంటే ఇలాంటి సమస్యలు రావని ఎద్దేవా చేశారు. ''ఇది మన ఇంటి సమస్య. మనమే పరిష్కరించుకోవాలి. కలిసి సంపాదించారు. పంపకాల్లో తేడా వచ్చి ఇప్పుడు కొట్టుకుంటున్నారు'' అంటూ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కీలక వ్యక్తి అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో విలేకరులతో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభాకర్ రావు దాదాపు 20 నెలల పాటు విదేశాల్లో ఉన్నారని, ఆయన్ను భారత్‌కు తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం సహకరించలేదని సీఎం ఆరోపించారు. అయితే, సుప్రీంకోర్టు ఆదేశాలతోనే ప్రభాకర్ రావును స్వదేశానికి తీసుకురాగలిగామని తెలిపారు. ఆయన భారత్‌కు వచ్చిన అనంతరమే ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ వేగవంతమైందని రేవంత్ రెడ్డి చెప్పారు. డీలిమిటేషన్ అంశంపై స్పందించిన సీఎం.. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణ రాష్ట్రాలకు, ముఖ్యంగా తెలంగాణకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారంపై ప్రశ్నకు స్పందిస్తూ.. అది ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. తెలంగాణలోని అన్ని ఆలయాల్లో విజయ డెయిరీ నెయ్యినే ఉపయోగిస్తున్నామని తెలిపారు.

## అమెరికా ఒత్తిడికి
# భారత్ తలొగ్గిందా?
### రష్యా నుంచి తగ్గిన ఆయిల్ దిగుమతి

**ముద్ర, నేషనల్ డెస్క్:** భారత్–అమెరికా మధ్య ఇటీవల మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. దానికి ముందు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50% టారిఫ్‌లను 18%కి తగ్గించారు. వాణిజ్య ఒప్పందం తర్వాత ట్రంప్ కీలక ప్రకటన చేశారు. భారత్ రష్యా ఆయిల్ కొనుగోలు తగ్గించి అమెరికా, వెనెజువెలా నుంచి కొంటుందని ప్రకటించారు. దీనిపై భారత్ అధికారికంగా స్పందించకపోయినా, గణాంకాలు మార్పును నిర్ధారిస్తున్నాయి. పుతిన్ దీన్ని భారత నిర్ణయంగా గుర్తించారు.

**తగ్గిన దిగుమతి..**

2025 డిసెంబర్‌లో రష్యా నుంచి 2.7 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ దిగుమతి చేసుకుంది. నవంబర్‌లోని 3.8 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ కొనుగోలు చేసింది. అంటే నెల రోజుల్లో ఆయిల్ దిగుమతి 27% తగ్గించింది. మొత్తం భారత ఆయిల్ దిగుమతిలో రష్యా వాటా 34% నుంచి 24.9%కి పడిపోయింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 15% కొనుగోలు తగ్గింది. 38 నెలలుగా రష్యా నుంచి జరుగుతున్న కొనుగోలులు ఇదే తక్కువ.

**పెరిగిన అమెరికా ఆయిల్ దిగుమతి..**

అమెరికా నుంచి 2025 డిసెంబర్ దిగుమతులు 2024తో పోలిస్తే 31% పెరిగాయి. రష్యా నుంచి 15 శాతం తగ్గితే.. అమెరికా నుంచి దిగుమతి రెట్టింపైంది. వెనెజువెలా కూడా ప్రధానంగా చేరుతోంది. ఇది ట్రంప్ వాగ్దానాలకు సమానంగా ఉంది, కానీ ఆర్థిక లాభాలు ప్రశ్నార్థకం.

**భారత్‌పై రవాణా భారం..**

రష్యా ఆయిల్ రవాణా ఖర్చు అమెరికా ఆయిల్ షిప్పింగ్ చార్జీలతో పోలిస్తే సగం ఉంటుంది. రష్యా నుంచి మనం రూపాయిల్లో కొనుగోలు (పెట్రో–రూపీ ఇన్వెస్ట్‌మెంట్) చేశాం. ఆ రూపాయలను కూడా రష్యా భారత్‌లోనే ఇన్వెస్ట్ చేసింది. అమెరికా నుంచి డాలర్లలోనే లావాదేవీలు జరుపుతున్నాం. ఇక అమెరికా నుంచి రవాణాకు భారత్ బ్యారెల్‌కు 4 నుంచి 5 డాలర్లు అదనంగా చెల్లించాలి. వెనెజువెలా ఆయిల్ కొంటే బ్యారెల్‌కు 10 డాలర్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. రష్యా ఆయిల్ తక్కువగా వస్తున్నా.. అమెరికా ఒత్తిడి కారణంగానే మోదీ రష్యా ఆయిల్ తగ్గించి అమెరికా ఆయిల్ పెంచినట్లు చర్చ జరుగుతోంది.

**ఆయుధ కొనుగోలుపైనా ప్రభావం..**

ఆయిల్ తగ్గుదల అమెరికా ఒత్తిడికి సూచన. తదుపరి రష్యా ఆయుధాలపై ఆంక్షలు, అమెరికా సామగ్రిని కొనుగోలు డిమాండ్ రావచ్చు. ఇది భారత విదేశాంగ వ్యూహాన్ని పరీక్షిస్తుంది. స్వాతంత్ర్య నిర్ణయాలు ఆర్థిక ఒత్తిడికి గురవకూడదు. రష్యా ఆధారం తగ్గడం ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఆత్మనిర్భర్ ఎనర్జీ, వైవిధ్యమైన మూలాలు అవసరం. అమెరికాకు పూర్తి తలొగ్గడం దీర్ఘకాలిక ప్రమాదం. సమతుల్య వాణిజ్యం, ఆర్థిక స్వాతంత్ర్యం కీలకం.



**ఆరోగ్యానికి మేలు చేసే టాప్ 10 పండ్లు**

అరటి పండు తక్షణ శక్తినిచ్చే పండు. కండరాల బలం, నర్వ్ వ్యవస్థకు మేలు చేస్తుంది.







# సేవ్ తెలంగాణ ఓట్ ఫర్ బీజేపీ

- **తీర్పు కాంగ్రెస్ కు గుణపాఠం కావాలి**
- **పొరపాటు చేస్తే.. ఐదేళ్లపాటు నరక యాతనే**
- **మున్సిపాలిటీలను అభివృద్ధి చేసే బాధ్యత మాదే**
- **కేంద్ర మంత్రి బండి సంజయ్**

**ముద్ర, కరీంనగర్:**

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలిచ్చే తీర్పు కాంగ్రెస్ అవినీతి, అరాచక పాలనకు చెంప పెట్టు కావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలిచ్చే తీర్పు ద్వారా అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. 'సేవ్ తెలంగాణ...ఓట్ ఫర్ బీజేపీ' అనే నినాదానికి అనుగుణంగా ఓటేయాలని కోరారు. ఎన్నికల్లో ప్రజల తీర్పు తెలంగాణలో మార్పుకు సంకేతం కావాలని అన్నారు. ఈ మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ పాలనలో ఏం చేశారో, గెలిస్తే ఏం చేస్తారో చెప్పకుండా, తిట్ల దండకాలు, తప్పుడు హామీలు, కుమ్మక్కు రాజకీయాలతో ప్రజలను మోసపెట్టడానికి ప్రయత్నించారని ఆరోపించారు. బీజేపీ మాత్రమే స్పష్టమైన ఎజెండాతో, స్పష్టమైన అభివృద్ధి కార్యాచరణతో ఎన్నికల్లో పాల్గొంటోంది. కేంద్రం నుండి నిధులు వస్తున్నాయని గుర్తు చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు నయాపైసా ఇయ్యలేదని, మున్సిపాలిటీల్లో నిజమైన పాలన రావాలంటే బిజెపికి ఓటు వేయాలని కోరారు.

**కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేస్తాం**

కరీంనగర్ కార్పోరేషన్ లో కబడ్డీ మొదలైందని కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి ఇక్కడికి రావడానికి భయపడ్డారని ఎద్దేవా చేశారు. కానీ తన రాజకీయ, రహస్య మిత్రుడు అసదొద్దీన్ ఒవైసీని పంపారని చెప్పారు. కరీంనగర్‌లో జరుగుతోన్న ఈ ఎన్నికలు ఇండియాపాక్ మ్యాచ్‌లా ఉంటాయన్నారు. కరీంనగర్ మేయర్ పీఠం కచ్చితంగా బీజేపీదేనని స్పష్టం చేశారు. సోమవారం కరీంనగర్ పట్టణంలో ఆయన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. కరీంనగర్ లో జరుగుతోన్న ఎన్నికలు ధనవంతులకు, గుణవంతులకు మధ్య పోటీ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కు ఓట్లేస్తే రాబోయే ఐదేళ్ల ఆ పైసలే మళ్లీ తిరిగి సంపాదించుకుంటారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, గ్యారంటీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. కరీంనగర్ అభివృద్ధికి సహకరించి ఓటు వేయాలని స్థానికులకు పిలుపునిచ్చారు.

# బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే

- **మంత్రి పొన్నం ప్రభాకర్**

**ముద్ర, కరీంనగర్ :**



కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎంపీ బండి సంజయ్ తీరుతో కరీంనగర్ అవినీతిమయమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఎంఐఎంతో కాంగ్రెస్ రూ.వంద కోట్ల ఒప్పందం చేసుకుందని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. పలు కార్పొరేషన్‌లో బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందం కుదుర్చుకున్నాయని, అవి రెండూ ఒక్కటేనని పొన్నం ఆరోపించారు. ఆ రెండు పార్టీల పరస్పర అవగాహనతోనే అభ్యర్థుల ఎంపిక కూడా జరిగిందన్నారు. పదేళ్లలో కరీంనగర్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్న మంత్రి వ్యాఖ్యానించారు.



# కోదాడలో ఈడీ సోదాలు

- **మనీ ల్యాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో దాడులు**

**ముద్ర ప్రతినిధి, కోదాడ:**

కోదాడ పట్టణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు నిర్వహించిన సోదాలు తీవ్ర కలకలం రేపాయి. పట్టణానికి చెందిన ఒక వ్యాపారవేత్తకు సంబంధించిన ఇల్లు, వ్యాపార సంస్థలపై ఒకేసారి ఈడీ అధికారులు దాడులు చేపట్టారు. ఈ సోదాల్లో భాగంగా నీలా సత్యనారాయణ నివాసంతో పాటు, అతనికి సంబంధించిన ఒక రైస్ మిల్, ఒక ఇంజనీరింగ్ కళాశాల, ఒక తవుడు మిల్లు, అలాగే అతని బంధువుల ఇళ్లలో కూడా ఈడీ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఉదయం నుంచే ప్రారంభమైన ఈ సోదాలు సాయంత్రం కూడా కొనసాగుతున్నట్లు సమాచారం. వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న భారీ రుణాలను, సంబంధిత ప్రయోజనాల కోసం వినియోగించకుండా ఇతర వ్యాపారాలు, ఖాతాలకు మళ్లించారన్న అభియోగాలు, పన్ను ఎగవేత లకు సంబంధించిన కేసులు ప్రధానంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**కీలక పత్రాలు, డిజిటల్ డేటా స్వాధీనం..**

సోదాల సమయంలో ఈడీ అధికారులు కీలకమైన ఆర్థిక పత్రాలు, లావాదేవీలకు సంబంధించిన పలు రికార్డులు, కంప్యూటర్ హార్డ్‌డిస్కులు తదితర డిజిటల్ డేటాను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

**పట్టణంలో ఉత్కంఠ**

మున్సిపల్ ఎన్నికల వేళ ఈడీ సోదాల వార్త కోదాడ పట్టణంలో వేగంగా వ్యాపించడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. పట్టణంలో మొదటిసారి ఈడీ దాడులు జరపటం వ్యాపార సంస్థలపై ఒకేసారి దాడులు జరగడంతో ప్రజలు, రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



## రూ.4.76 కోట్ల గంజాయి కాల్చివేత

**ముద్ర, ఖమ్మం:**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలోని ఆరు ఎక్సైజ ్ స్టేషన్ల పరిధిలో నమోదైన 47 కేసుల్లోని 953 కేజీల గంజాయిని కాల్చివేతకు ఖమ్మం డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి అదేశాలు జారీ చేశారు. ఈ మేరకు స్టేషన్లలో కేసుల వారిగా గంజాయిని ఒక దగ్గరకు చేర్చి మొత్తంగా 953 కేజీల గంజాయిని ప్రభుత్వ అమోదిత ఏడబ్ల్యూఎం కన్సంటింగ్ లిమిటేడ్ కాల్చివేత పరిశ్రమలో సోమవారం కాల్చివేశారు. ఈ కంపెనీ తల్లాడ మండలం గోపాల్‌పేట్‌లో ఉంది. కాల్చివేసిన గంజాయి విలువ రూ. 4.76 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు.ఖమ్మం జిల్లాలోని ఖమ్మం 1 ఎక్సైజ్ స్టేషన్‌లో 9 కేసుల్లో 42 కేజీలు, ఖమ్మం `2 స్టేషన్‌లో5 కేసుల్లో 57 కేజీల, మధిర స్టేషన్‌లోని 7 కేసుల్లో 193 కేజీల, కొత్తగూడం జిల్లాలోని పాల్వంచ స్టేషన్‌లో 2 కేసుల్లో 114 కేజీలు, మణుగూర్ స్టేషన్‌లో ఒక కేసులో 21 కేజీలు, భద్రాచలం స్టేషన్‌లో 23 కేసుల్లో 625 కేజీల గంజాయిని కాల్చి వేసినట్లు డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు.

# సాక్ష్యాలు లేకుండా చేద్దామనుకున్నాడు..

- **రేవంత్ రెడ్డి జైలుకు పోయే టైం దగ్గరకొచ్చింది**
- **ఆయన ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ**
- **ఫోరెన్సిక్ ల్యాబ్‌ను తగలబెట్టిండు**
- **ప్రమాదమని నమ్మించే ప్రయత్నం చేసిండు**
- **మాజీ మంత్రి హరీష్ రావు**

**ముద్ర, సిద్దిపేట :**



సీఎం రేవంత్ రెడ్డికి జైలుకు వెళ్లే సమయం దగ్గరపడిందని మాజీ మంత్రి హరీశ్ రావు చెప్పారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగ రేవంత్ కు శిక్షపడక తప్పదన్నారు. శిక్ష నుంచి తప్పించుకునేందుకు ఆయన నానా తంటాలు పడుతున్నారన్నారు. ఇందులో భాగంగా ఆ కేసులో విచారణ ఫైళ్లు ఉన్న నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్ ను తగలబెట్టించారని ఆరోపించారు. ఎవరికీ అనుమానం రాకుండా ప్రమాదవశాత్తు జరిగిందని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీలో పర్యటించారు. చెల్లాపూర్ వార్డులో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ..

రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని, 420 హామీలు ఇచ్చి ఒక్క హామీని అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ హయాంలో భూముల విలువ పెరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు తగ్గడమే కాదు.. తెలంగాణ ప్రతిష్ట కూడా దిగజారిందని అన్నారు. హామీలు, గ్యారంటీల పేరుతో మోసం చేసి కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చారని విమర్శించారు. తెలంగాణ భవిష్యత్ గురించి ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డికి చురుకు తగిలితేనే పథకాలు అమలవుతాయని స్పష్టం చేశారు. మెదక్ రావాలంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని హరీశ్‌రావు అన్నారు. అన్ని జిల్లాలు తిరుగుతున్న రేవంత్ రెడ్డి ఉమ్మడి మెదక్‌కు వచ్చేందుకు ముఖం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ లేదు కానీ.. స్కామ్ క్యాలెండర్ అయితే ఇచ్చిండని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు సస్యశ్యామలంగా, పాడిపంటలతో సుభిక్షంగా, చల్లగా ఉండేవారని, రేవంత్ సర్కారులు నీటి కష్టాలు, కన్నీటి బాధలు గ్రామాలను ముంచెత్తుతున్నాయని విమర్శించారు.



## సింగరేణి ప్రజలకోసం
# జీవో 76ను పరిష్కరిస్తాం

- **కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే మరిన్ని ప్రగతి**
- **రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ముద్ర, కొత్తగూడెం:**

కొత్తగూడెం సింగరేణి ప్రాంతంలో ఇండ్ల స్థలాలకు సంబంధించి జివో 76ను పరిష్కరించి ప్రజలకు మేలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ప్రచారం నిర్వహించిన మంత్రి మాట్లాడారు. ఇప్పటికే ఈ ఇళ్ల స్థలాల సమస్యపై సీఎం రేవంత్ రెడ్డి, భూపాలపల్లి సభలో స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. కార్మిక పక్షపాతిగా నిలిచిన తమ ప్రభుత్వం వారికి న్యాయం చేస్తుందన్నారు. ఎమ్మెల్యే నుంచి ఎంపీ, మంత్రి, ముఖ్యమంత్రి వరకు అందరూ కాంగ్రెస్ ప్రతినిధులేనన్న మంత్రి... ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధి ఫలాలు అందుకోవాలన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కాంగ్రెస్, మిత్రపక్ష అభ్యర్థులను గెలిపించాలన్నారు. కొత్తగూడెం పరిధిలోని 60 డివిజన్లలో 58 చోట్ల కాంగ్రెస్,2 చోట్ల సిపిఎం అభ్యర్థులు పోటీ చేస్తున్నారని వీరందరినీ గెలిపించాలని మంత్రి పొంగులేటి కోరారు. కొత్తగూడెం ప్రాంతంలోని రోడ్లు, డ్రైనేజీ, వంతెనల నిర్మాణం, ఎంతో కాలంగా ఇక్కడి ప్రజలను వేధిస్తున్న మంచి నీటి సమస్య తీరి 24 గంటలూ మంచినీటి సరఫరా కావాలన్నా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, అర్హులైన పేదలకు ఇంటిస్థలంతో పాటు ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు.

# ముగిసిన పీఐబీ ప్రతినిధుల పర్యటన

- **ఒడిశా అభివృద్ధి పథకాల పరిశీలన**
- **గవర్నర్‌తో భేటీ అయిన బృందం**

**ముద్ర, హైదరాబాద్:**



హైదరాబాద్ పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) నేతృత్వంలో తెలంగాణకు చెందిన ఆరుగురు సభ్యుల మీడియా ప్రతినిధుల బృందం ఒడిశాలోని భువనేశ్వర్‌లో అయిదు రోజుల అధికారిక పర్యటనను ముగించుకుంది. భువనేశ్వర్‌లోని లోక్ భవన్‌లో ఒడిశా గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటితో జరిగిన మర్యాదపూర్వక భేటీతో ఈ పర్యటన ముగిసింది. కేంద్ర ప్రభుత్వ కీలక అభివృద్ధి కార్యక్రమాలపై మీడియా ప్రతినిధులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడంతో పాటు ఒడిశా సాంస్కృతిక వారసత్వం, మౌలిక సదుపాయాల వృద్ధి, పరిశోధనా సంస్థలను గురించి తెలియజేయాలనే లక్ష్యంతో పీఐబీ హైదరాబాద్ ఈ పర్యటనను ఏర్పాటు చేసింది. మీడియా ప్రతినిధి బృందానికి భువనేశ్వర్ పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీ అఖిల్ కుమార్ మిశ్రా స్వాగతం పలికారు. ఆయన రాష్ట్ర మీడియా రంగం, ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాల గురించి వివరించారు. అయిదు రోజుల పర్యటనలో భాగంగా సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వాకల్చర్ (సీఐఎఫ్ఏ), ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (ఐఎంఎంటీ) వంటి ప్రముఖ సంస్థలను మీడియా ప్రతినిధుల బృందం సందర్శించింది. వీటితో పాటు కళాభూమి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ మ్యూజియం, లింగరాజ దేవాలయం, ధౌలి శాంతి స్తూపం, యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద అయిన కోణార్క్ సూర్య దేవాలయం, రఘురాజ్‌పూర్ సాంస్కృతిక కళల గ్రామం, పూరీలోని జగన్నాథ ఆలయంతో సహా ప్రధాన వారసత్వ, సాంస్కృతిక ప్రాంతాలను సందర్శించిన ప్రతినిధులు.. ఒడిశాకు ఉన్న గొప్ప వాస్తు శిల్ప కళలు, మతపరమైన సాంస్కృతిక సంప్రదాయాలపై అవగాహన పెంచుకున్నారు.

అయిదు రోజుల పర్యటన లోక్ భవన్‌లో ఒడిశా గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటితో జరిగిన మర్యాదపూర్వక భేటీతో ముగిసింది. ఇక్కడ ఉన్నతాధికారులతో సంభాషించిన మీడియా ప్రతినిధులు.. క్షేత్రస్థాయి పర్యటన అనుభవాలను పంచుకున్నారు. ఒడిశా సాధిస్తున్న స్థిరమైన ఆర్థిక వృద్ధిని, 1.30 లక్షల కోట్ల రూపాయలకు మించిన ప్రధాన మౌలిక సదుపాయాల పెట్టుబడులను, అన్ని జిల్లాలకు రైల్వే అనుసంధానాన్ని కల్పించటం, ఓడరేవులు, రహదారులు, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి గురించి గవర్నర్ ప్రముఖంగా ప్రస్తావించారు. చిరుధాన్యాల ఉత్పత్తి, ఖనిజ ఆధారిత పరిశ్రమల విషయంలో రాష్ట్రం చూపిస్తున్న నాయకత్వాన్ని ప్రధానంగా పేర్కొన్న ఆయన.. ఐఐటీ, ఎయిమ్స్, నైజర్, వరల్డ్ స్కిల్ సెంటర్ వంటి విద్యా, నైపుణ్యాభివృద్ధి సంస్థల వృద్ధి గురించి చెప్పారు.

## సాగునీటి కోసం రైతన్నల ధర్నా

**ముద్ర, వైరా:**

సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతన్నలు రాస్తారోకో చేపట్టారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి వద్ద రహదారిపై నీళ్ల కోసం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... సాగునీరు రాక మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయని, నాగార్జున సాగర్ నుండి అధికారులు నీళ్లు విడుదల చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు పట్టించుకోవడం లేదని, పంటలను ఆదుకోవాలని కోరారు. వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏన్కూరు - పల్లిపాడు రహదారిపై ధర్నాకు దిగారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 10.02.2026
www.mudranews.in
@mudranews
mudratv



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# ఎవరి భాషకు ఎంత పదును..?

- పాలకపక్ష ప్రభుత్వానికి తొలి పరీక్ష
- విపక్షాల నిర్మాణాత్మక పాత్రకు అగ్నిపరీక్ష
- నేతల భాషా ప్రయోగం
- పుర పోరుపై ప్రభావం

తెలంగాణ ఉద్యమంలో ప్రజల మస్తిష్కాలను ప్రజ్వరిల్లింపజేసి ఈ ప్రాంత భావజాలాన్ని అట్టడుగు స్థాయికి తీసుకుపోయి ప్రజలను ఏకతాటిపై నిలబడంలో ప్రధాన భూమిక పోషించిన తెలంగాణ యాస భాషకే దక్కుతుందనడంలో అతిశయోక్తి లేదు. భాష పదును రాజకీయ పరిస్థితులనే మార్చి వేసిందని చెప్పడంలో చర్చకు తావే లేదు. తొలి దశ తెలంగాణ ఉద్యమానికి ముందు ఎలాంటి భాషను వినియోగించారో చెప్పడానికి ఇప్పుడు ఉన్నటువంటి మాధ్యమాలు అప్పుడు అంతగా లేవు. తెలంగాణ విద్యావంతులు మేధావులు కళాకారులు ఉపయోగించిన భాష ప్రతి ఒక్కరి హృదయాలను కట్టిపడేసింది. ఆలోచింపజేసింది. ప్రజా చైతన్యానికి నాంది పలికింది. అణచివేత, దోపిడీపై పిడికిలెత్తేలా చేసింది. స్వచ్ఛమైన తెలంగాణలో స్వేచ్ఛ స్వాతంత్ర్యాల కోసం నడుము బిగించేలా చేసింది. స్వరాష్ట్ర సాధన సాకారంలో భాషా ప్రయోగ చైతన్య దీపికల ప్రభావాన్ని అంచనా వేయడం అసాధ్యం. భాషా ప్రయోగానికి అంతటి ప్రాధాన్యత ఉన్నది. తెలంగాణ స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత గద్దెనెక్కిన పాలకుల భాషా ప్రయోగం తీరే మారిపోయింది. ప్రజలను ఆలోచింపజేసేదిగా కాకుండా రెచ్చగొట్టేదిగా, ఉద్వేగ బరితులను చేసేదిగా మారింది. పాలకపక్ష నేతలు ప్రతిపక్ష నేతలు తేడా లేకుండా ఒకరిని మించి ఒకరు ప్రజలను ఎంత ఉద్విగ్న భరితులను చేస్తే అంత గొప్ప భాష ఉపయోగించిన విధంగా పరిస్థితుల్లో మార్పు తెచ్చారు. పాలనలోనూ ప్రచారంలోనూ వాడే భాషనే ప్రజల తీర్పును ప్రభావితం చేస్తుందని గ్రహించిన పెద్దలు పదవుల హుందాతనని మరచి భాషా ప్రయోగానికి తెగబడుతున్నారు. దానివల్ల ఎన్నికల్లో కొంతవరకు ఫలితాలను కూడా ప్రభావితం చేస్తున్నాయి. ప్రధానంగా ఎన్నికల ప్రచారాలలో వాడే పలు భాషా పద ప్రయోగానికి మార్కులు పడి ఎన్నికలలో ఫలితాలను రాబట్టవచ్చనే అభిప్రాయంగా మారిపోతూ వస్తుంది. అధికారంలోకి రావడానికి అధికారంలో కొనసాగడానికి నాయకులు నేతలు ప్రయోగిస్తున్న భాషా పదజాలం తెలంగాణ ప్రగతి ప్రజల జీవనస్థితిగతులలో మార్పులు తీసుకురావడానికి ఆలోచింపజేసేదిగా లేదనే విషయం సుస్పష్టం. నాయకుల భాష పై ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో తీర్పు రూపంలో భాషా ప్రయోగం ఎంతో కొంత శాతం సత్ఫలితాలకు కానీ దుష్ఫలితాలకు గాని దారితీస్తూనే ఉంది. ఇంత చెప్పడానికి ప్రధాన కారణం పదేళ్ల తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ పాలన అనంతరం రెండేళ్లుగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తున్న తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం లో మొదటిసారి పార్టీ గుర్తుల ఆధారంగా మున్సిపల్ ఎన్నికలు జరుగు తుండడం ఈ ఎన్నికలు

**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు తొలి పరీక్ష కాబోతున్నాయి.**

★ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు సాధారణ స్థానిక సంస్థల పోటీ కాదు. ఇవి అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తొలి ప్రజా పరీక్ష, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు తిరిగి పుంజుకునే అవకాశము, బీజేపీకి పట్టణ రాజకీయాల్లో తన స్థానం వెతుక్కునే ప్రయోగం. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి స్థానిక అంశాలే ఓటింగ్‌ను ప్రభావితం చేస్తున్నప్పటికీ, ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాలపై స్పష్టమైన సంకేతాలు ఇవ్వబోతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికార బలం అనే నినాదం తో ప్రచారము కొనసాగుతున్నది.. ఎక్కడ కూడా నిర్లక్ష్యం లేకుండా అవకాశాలను అదునుగా అధికార పార్టీగా కాంగ్రెస్ ఈ మున్సిపల్ ఎన్నికలను రక్షణాత్మకంగా ఎదుర్కొంటోంది. ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాల అమలే తమ ప్రధాన ఆయుధమని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం చెబుతోంది. ఉచిత బస్సు, పెన్షన్లు వంటి పథకాలతో లబ్ధిదారుల మద్దతు దక్కుతుందనే లెక్కలేస్తుంది...కానీ పట్టణ ఓటరు ముందు కాంగ్రెస్‌కు కఠిన ప్రశ్నలను ఎదుర్కోవల్సొస్తుంది, ధరలు, ట్రాఫిక్, మౌలిక వసతులు ఉద్యోగాల అంశాల్లో స్పష్టమైన మార్పు కనిపించలేదన్న భావన బలంగా ఉంది. మున్సిపల్ సమస్యలపై ఇప్పటి వరకు ప్రభుత్వ స్థాయి చర్యలు స్పష్టంగా కనిపించకపోవడం కూడా కాంగ్రెస్‌కు మైనస్‌గా మారుతోంది.



ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే అది తమ పాలనపై ప్రజల విశ్వాసంగా భావించవచ్చు. ఓడితే మాత్రం పాలనపై తొలి హెచ్చరికగా మారే అవకాశం ఉంది...కాంగ్రెస్ పార్టీ లో ప్రజాస్వామ్యం ఎక్కువే...మున్సిపల్ ఎన్నికలలో ఆశించినంత ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి రాకుంటే గ్రూప్ రాజకీయాలు బహిర్గతం అవుతావేమో అనే సందేహం ఏర్పడక తప్పదని విశ్లేషకుల అభిప్రాయం..

**పట్టణ అభివృద్ధే ప్రధాన అస్త్రం**

ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ ఈ మున్సిపల్ ఎన్నికలను అనుకూల వేదికగా భావిస్తోంది. గత రెండు పర్యాల పాలనలో పట్టణాల్లో చేసిన రోడ్లు, డ్రైనేజీలు, మిషన్ భగీరథ, మౌలిక వసతుల అభివృద్ధినే ప్రధాన ప్రచార అంశంగా మలుస్తోంది. "పట్టణాలను కట్టింది మేమే" అన్న నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై పనులు నిలిచిపోయాయన్న విమర్శను గట్టిగా వినిపిస్తోంది. ఆరు గ్యారంటీలు, హామీలు నోటి మాటలే తప్పా అభివృద్ధి శూన్యం అనే ప్రచార సాధనలతో ఉన్నారు... పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికీ బీఆర్ఎస్‌కు బలమైన కేడర్ ఉండటం పార్టీకి అదనపు బలం..అయితే అధికారంలో లేని పార్టీగా హామీలు ఇవ్వడంలో పరిమితులు ఉన్నాయి. గత పాలనపై ఉన్న అసంతృప్తి కూడా కొన్నిచోట్ల బీఆర్ఎస్‌కు అడ్డంకిగా మారుతోంది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు లాభం కలిగితే అది రాష్ట్ర రాజకీయాల్లో తిరిగి ఊపు వచ్చినట్టే... కాని ఇప్పటిదాకా బి ఆర్ ఎస్ మీద ఇంకా ఆశించినంత ప్రజలలో సానుభూతి రాలేదు...

బీజేపీకి తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు పూర్తిస్థాయి గెలుపు కోసం కాదు. పట్టణాల్లో తన ఓటు శాతాన్ని పెంచుకోవడమే ప్రధాన వ్యూహం. కేంద్ర ప్రభుత్వ పథకాలు, కాంగ్రెస్ బీఆర్ఎస్ రెండింటినీ ఒకే తాటిపై పెట్టే విమర్శలతో పట్టణ మధ్యతరగతి, యువతపై దృష్టి పెట్టింది.

కానీ బలమైన స్థానిక నాయకత్వం లేకపోవడం, మున్సిపల్ సమస్యలపై స్పష్టమైన ప్రత్యామ్నాయ ప్రణాళిక లేకపోవడం బీజేపీకి పెద్ద బలహీనత. ఈ ఎన్నికల్లో బీజేపీ నిర్ణయాత్మక శక్తిగా కాకపోయినా, ఓటు చీలికకు కారణమయ్యే అవకాశముంది..

**ప్రజల తీర్పు పనితనానికే**

ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల మూడ్ స్పష్టం. రాష్ట్ర రాజకీయాల ప్రభావం ఉన్నా, చివరికి ఓటరు చూస్తున్నది స్థానిక పనితనమే.రోడ్డు బాగుందా డ్రైనేజీ పనిచేస్తుందా తాగునీరు సమయానికి వస్తుందా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగల అభ్యర్థికే ప్రజల మద్దతు దక్కే పరిస్థితి కనిపిస్తోంది. ఈ మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్‌కు హెచ్చరిక కావచ్చు. బీఆర్ఎస్‌కు పునరాగమన సంకేతం కావచ్చు. బీజేపీకి భవిష్యత్తు ప్రయోగంగా మారవచ్చు.ఫలితాలు ఏ పార్టీకి అనుకూలంగా వచ్చినా ఒక విషయం మాత్రం ఖాయం. తెలంగాణ పట్టణ ఓటరు ఇక మాటలు కాదు, పనులనే ఓటుగా మారుస్తున్నాడు.అనేది ఈ ఎన్నికల అసలు సందేశం.నేటితో మాటలు మూగబోతావి...

మాటల రాజకీయానికి మున్సిపల్ హెచ్చరికగా,పాలన కంటే దూషణలు పెద్దవైతే, ప్రజల తీర్పు మౌనంగా కానీ కఠినంగా ఉంటుంది.తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు ఎల్లుండి జరుగే తీర్పులో , రాజకీయ వాతావరణం ప్రజల దైనందిన సమస్యల చుట్టూ కాకుండా మాటల దిగజారుడు చుట్టూ తిరుగుతోంది. ముఖ్యమంత్రి నుంచి ప్రతిపక్ష నేతల వరకూ వినిపిస్తున్న సంస్కారం లేని వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు, అహంకార ప్రదర్శనలు ఇవి ప్రజాస్వామ్య రాజకీయాలకు ప్రమాదకర సంకేతాలు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం చూస్తే పాలనపై చర్చ కనపడటం లేదు; పదజాలపు పోటీ మాత్రమే కనిపిస్తోంది. ఇది ప్రజల సహనాన్ని పరీక్షించే దశకు రాజకీయాలను తీసుకెళ్లింది.

ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న నాయకుడు మాటల విషయంలో అదుపు కోల్పోతే, అది కేవలం వ్యక్తిగత వైఖరి కాదు పాలనా శైలికి అద్దం. అధికారంలో ఉన్నవారు మాటల్లోనే సంస్కారం కోల్పోతే, అధికార వినియోగంలో బాధ్యతపై సందేహం తలెత్తడం సహజం. ఇది ముఖ్యంగా పట్టణ ప్రజల్లో తీవ్రంగా ప్రతిధ్వనిస్తోంది.

అదే సమయంలో ప్రతిపక్షానికి ప్రజల విశ్వాసం పొందే గొప్ప అవకాశం. కానీ ప్రతిపక్షం కూడా అదే స్థాయిలో దూషణల రాజకీయానికి దిగితే, ప్రజల్లో ఏర్పడే భావన ఒక్కటే "ఇద్దరూ ఒకటే."

ఈ భావన అధికారానికి లాభం కాదు, ప్రతిపక్షానికి గెలుపు కాదు; ఇది ప్రజాస్వామ్యానికి నష్టం.

తెలంగాణ పట్టణ ఓటరు ఇక మౌనంగా ఉండే అమాయకులు కారు.సోషల్ మీడియా ద్వారా ప్రతి మాట రికార్డు అవుతోంది, ప్రతి వ్యాఖ్య గుర్తుపెట్టుకుంటున్నారు. ముఖ్యంగా మహిళలు, యువత, మధ్యతరగతి వర్గాలు సంస్కారం లేని మాటలను "బలమైన నాయకత్వం"గా కాకుండా అహంకారంగా చూస్తున్నాయి.

ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో వచ్చే ఫలితాలు సంపూర్ణ తిరస్కారంగా కాకపోయినా, స్పష్టమైన హెచ్చరిక తీర్పుగా మారే అవకాశాలు ఎక్కువ.

**మాటల రాజకీయానికి ఓటు తగ్గింపు**
**పనితీరు లేని నాయకులకు మౌన శిక్ష**
**స్థానికంగా పనిచేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం**
**ఇవే ఫలితాల్లో కనిపించే సంకేతాలు కావచ్చు.ఈ ఎన్నికలు సీఎం వర్సెస్ ప్రతిపక్షం కాదు సంస్కారం వర్సెస్ అహంకారం**
**ప్రజలు కోరుకుంటున్నది గట్టిగా అరచే నాయకత్వం కాదు.గౌరవంగా మాట్లాడే పాలన.దూషించే మాటలు కాదు.**
**పనిచేసే చేతులు.మాటలు మారకపోతే,**
**తీర్పు మారుతుంది.**
**ఆ మార్పు మున్సిపల్ ఎన్నికలతోనే మొదలయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి......**

-మధు గౌడ్ జి
జర్నలిస్ట్.
ఎం. ఏ, ఎం. సి.జె.
9493320002



## నేను ఓటరును...



రోజులు గడిచిపోయాయ్
డిజేలు మూగబోయాయ్
నాయకుల హడావిడితో
నిత్యం కళకళలాడిన
పురవీధులు అలసిపోయి
పసిపాపల్లా నిద్దరోతున్నాయి
అయినా ఎక్కడో అలజడులు..
అర్థం కాని గందరగోళాలు
నడుస్తున్నట్టే ఉన్నా
ఎవరో నడిపిసున్నారేమో అనే భావన
నాయకులిచ్చిన నోటు తో
రేపటి ఉదయం ఓటెయ్యాలంటే
ఎక్కడో గుండెల్లో గుబులౌతోంది
కళ్లలో కనిపించని ధైర్యం
కాళ్లతో నడిపిస్తుంటే
నీడని చూస్తూ కూడా భయపడుతూ
ఏది తెలుపో...
ఏది నలుపో తేల్చుకోలేక...
గతి తప్పిన ప్రజాస్వామ్యంలో
గతిలేని పరిస్థితులలో
పురపాలకులను ఎన్నుకోడానికి
అనుమానాలతో నిండిపోయిన
నా మనసుతో అడుగేస్తున్నా

- రాం శీను
7396828180



# నులిపురుగుల నిర్మూలనతోనే బాలారోగ్యం

**ఫిబ్రవరి 10 జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (డీవార్మింగ్ డే) అవశ్యకత:**

1 నుండి 19 సంవత్సరాల పిల్లల్లో నులిపురుగుల వల్ల కలిగే రక్తహీనత,పోషకాహార లోపం,శారీరక/మానసిక ఎదుగుదల లోపాలను నివారించడం.పిల్లల కడుపులో క్రిముల వల్ల సాధారణ భాషలో నట్టలుగా వ్యవహరించే క్రిముల వల్ల కలిగే అనారోగ్య సమస్యలను రూపుమాపడానికి భారత ప్రభుత్వం 2015 సంవత్సరం నుండి "జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం (ఎన్.డి.డి.)" కార్యక్రమాన్ని ఏటా రెండుసార్లు ఫిబ్రవరి,ఆగస్టు మాసాలలో ఆరు నెలలకోసారి ఎన్.డి.డి. రోజున అన్ని రాష్ట్రాలలో డివార్మింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తూ పిల్లలకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు (ఆల్బెండజోల్ టాబ్లెట్స్) నమిలి మింగించడం జరుగుతుంది. పిల్లలు తరచుగా కడుపునొప్పితో గానీ, కాళ్ళు ముఖం ఉబ్బటం గానీ, ఆకలి మందగించడం, నీరసంగా, మందకొడిగా, బరువు తగ్గడం, రక్తహీనత, మలద్వారం చుట్టూ దురద మొదలగు ఏదైనా ఒక లక్షణంతో శారీరకంగా లేదా మానసికంగా అనారోగ్యంతో బాధపడుతుంటే కడుపులో నట్టలు ఉన్నట్టు అనుమానించవచ్చు.

**శాఖల సమన్వయంతోనే సాధ్యం:**

బడి పిల్లలతో ప్రారంభించిన ఎన్.డి.డి. కార్యక్రమం ఆ తర్వాత బడిబయట పిల్లలకు మరియు 1సంవత్సరం వయస్సు చిన్నారుల నుండి 19 సం.ల వయసు పిల్లలందరికీ డీవార్మింగ్ టాబ్లెట్స్ వేయడం జరుగుతుంది. వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల సమన్వయం,సహకారం, సౌజన్యంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఎన్.డి.డి. రోజైన రేపు పిల్లలకు 400 ఎం. జి ఆల్బెండజోల్ మాత్రలను నమిలి మింగించడం జరుగుతుంది.

**నులిపురుగులు అంటే ఏమిటి:?**

నులి పురుగులనేవి మానవుని ప్రేగులోంచి పోషకాలను, రక్తాన్ని గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు మానవుడు అతిదేహిగా నులిపురుగులు అతిథి గా వ్యవహరిస్తాయి.నులిపురుగులు మూడు రకాలు. ఏలిక పాములు,నులి పురుగులు, కొంకి పురుగులు ఏలిక పాములనే రౌండ్ వార్మ్ లుగా పిలుస్తారు.వీటి శాస్త్రీయ నామం: అస్కారిస్ లుంబికాయిడీస్. ఇవి 10 సెం.మీ నుండి 20సెం.మీ. పొడవుంటాయి. రోజుకు రెండు లక్షలకు పైగా గుడ్లు పెడతాయి. ఎక్కువ సంఖ్యలో ఏలిక పాములు ఉండటం వల్ల ఇవి ప్రేవులలో అడ్డు గోడలుగా నిలుస్తాయి. వీటివల్ల అజీర్తి, కడుపు నొప్పి, నీరసం, పోషకాహార లోపం ఏర్పడుతుంది. నులి పురుగులు వీటిని పిన్ వార్మ్ అని పిలుస్తారు. ఈ పురుగులు తెల్లని రంగులో సన్నగా దారం పోగులాగా అర అంగుళం పొడవు ఉంటాయి. వీటి శాస్త్రీయ నామం: ఎంటరోబియస్ వెర్మికులారీస్స హిరంగ ప్రదేశంలో మల విసర్జన చేయడం వల్ల మట్టి కలుషితమై ఆ గుడ్లు చేతుల ద్వారా నీరు,ఆహారం ద్వారా ఇతరులకు వ్యాపించును. వీటివల్ల మలద్వారం చుట్టూ దురద, రాత్రిపూట ఎక్కువగా మూత్ర విసర్జన జరుగుతుంది.

కొంకి పురుగు వీటిని సాధారణంగా హుక్ వార్మ్ అని పిలుస్తారు.వీటి శాస్త్రీయ నామం అంకిలోస్టోమా డ్యుయోడినెల్ ఇవి నోటి ద్వారా కాకుండా పాదచర్మం ద్వారా సంక్రమిస్తాయి. కొంకి పురుగులు తమ నోటి దంతాల ద్వారా పేగులకు రంధ్రాలు చేసి రక్తాన్ని పీలుస్తాయి. వీటి గుడ్లు మట్టిలో చేరి ఎనిమిది రోజుల్లో లార్వాగా సన్నని దారం వలె రూపొందుతాయి. ఈ దశలో పాదాల చర్మం ద్వారా శరీరంలోకి వెళ్తాయి. వీటివల్ల రక్తహీనత, నీరసం, ఇస్నోఫీలియా ఎక్కువగుట, పిల్లలలో శారీరక, మానసిక పెరుగుదల లోపం, కాళ్లవాపులు, ముఖం ఉబ్బడం జరుగుతుంది. నులిపురుగుల సంక్రమణ వేటి ద్వారా జరుగుతుంది:? వరిసరాలు పరిశుభ్రంగా లేని ప్రాంతాలలో మానవ మలంలో ఉన్న హెల్మెంథీస్ పరాన్నజీవుల గుడ్ల ద్వారా మట్టి కలుషితం అయి 'మట్టి ద్వారా సంక్రమించే హెల్మెంథీస్ పురుగులు



వ్యాప్తి చెందుతాయి.ఆరుబయట చెప్పులు లేకుండా వట్టి కాళ్ళతో మట్టిలో ఆడుకోవడం, అపరిశుభ్రమైన సురక్షితం కాని నీరు,ఆహారం తీసుకోవడం. భోజనం చేసే ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బు నీటితో కడుక్కోపో వుట, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయుట, పెరిగిన గోళ్లను కత్తిరించక పోవడం. వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరి సరాల పారిశుధ్యం లోపించడం, అపరిశుభ్రమైన ఆకు కూరలు, కాయగూరలు, పండ్లు తీసుకోవడం ద్వారా నులి పురుగులు నోటిద్వారా లేదా అరికాళ్ళ చర్మం ద్వారా సంక్రమిస్తాయి.

**ఎవరెవరికి,ఎక్కడ ఈ మాత్రలు అందిస్తారు:**

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం అనగా 10 ఫిబ్రవరి 2026 రోజున అంగన్వాడీ కేంద్రాలలో నమోదు చేయబడిన ఒకటి నుంచి ఐదు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు మరియు 6 నుంచి 19 సం.ల వయస్సు గల బడి బయట పిల్లలకు అంగన్వాడీ/ఆషా కార్యకర్తలు అల్బెండజోల్ మాత్రలు వేస్తారు.

ప్రభుత్వ , ప్రైవేటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కాలేజీలలో నమోదు చేయబడిన 6 నుంచి 19 యేళ్ళ పిల్లలందరికీ ఎన్.డి.డి. రోజు ఏ.ఎన్.ఎం.లు, ఉపాధ్యాయులు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారు. ఆ రోజు పాఠశాలకు గైర్హాజరైన పిల్లలకు 17 ఫిబ్రవరి 2026 (మాప్ అప్ డే) రోజున తిరిగి మాత్రలు వేస్తారు. అనాధ ఆశ్రమాలు, చైల్డ్ కేర్ సెంటర్లు మరియు చదువుకునే, ఆటలాడుకునే, పనిచేసే అన్ని ప్రదేశాలలో 1 నుంచి 19 సంవత్సరాల వయసున్న పిల్లలకు ఆరోగ్య సిబ్బంది మాత్రలు వేస్తారు. నులిపురుగుల ప్రభావం ఎక్కువగా ఉన్న పిల్లలలో ఈ మాత్ర వేసుకున్న తర్వాత కొందరికి వికారం,స్వల్ప కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు కలుగవచ్చు. కంగారుపడాల్సిన పనిలేదు. వెంటనే స్థానిక వైద్యారోగ్య సిబ్బందికి తెలియజేయాలి. పిల్లలు ఈ మాత్రను డైరెక్ట్ మింగకుండా బాగా నమిలి మింగే విదంగా చూడాలి. నమలకుండా మింగితే నిర్మూలనా ప్రభావం తగ్గే అవకాశం ఉంది.

**ఎంత మోతాదులో ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలి:**

1 నుంచి 2 సంవత్సరాల చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్ర (200mg) రెండు స్పూన్ల మధ్య నలిపి,నీటితో కలిపి మింగిస్తారు.2 నుంచి 3 సం.ల పిల్లలకు పొడి చేసిన ఒక పూర్తి మాత్ర (400 ఎమ్.జి.) మరియు 3 నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలు అల్బెండజోల్ మాత్ర (400 ఎమ్.జి.) భోజనం చేసిన తర్వాత నమిలి నీటితో మింగించాలి.యన్.డి.డి. నిర్వహణ సమయంలో అంగన్ వాడీ కేంద్రాలు,పాఠశాలలు, కాలేజీల్లో శుభ్రమైన త్రాగు నీరు, గ్లాసులు ఏర్పాటు చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ వస్తున్నారు. ప్రార్థన సమయంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం మరియు చేతులను సబ్బు నీటితో కడుక్కునే పద్ధతులను నేర్పించడం వల్ల ప్రయోజనం ఉంటుంది.

**ఆల్బెండజోల్ మాత్రలు ఎవరు వేసుకోకూడదు:?**

జబ్బులున్న వారు, దీర్ఘకాలికంగా మందులు వాడుతున్న పిల్లలు ఈ మాత్రలు వేసుకోరాదు.ఖాళీ కడుపుతో మాత్రలు వేసుకో రాదు. ఎట్టి పరిస్థితుల్లో టాబ్లెట్ పిల్లవానికి ఇంటికి ఇవ్వరాదు.ఆల్బెండజోల్ మాత్ర పిల్లలకు,పెద్దలకు కూడా సురక్షిత మైనది.

**నులి పురుగులు రాకుండా నివారణ చర్యలు:**

బయటకు వెళ్లినప్పుడు చెప్పులు ధరించాలి. సురక్షితమైన నీరు, పరిశుభ్రమైన ఆహార పదార్థాలు తీసుకోవాలి. భోజనం, ఇతర ఆహార పదార్థాలు తినే ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బు నీటితో కడుక్కోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా, మరుగు దొడ్లను వాడాలి. పెరిగిన గోళ్లను కత్తిరించి, శుభ్రంగా ఉంచుకోవాలి.పరిశుభ్రంగా కడిగిన ఆకుకూరలు, కాయ గూరలు, పండ్లు తీసుకోవాలి, పరిసరాల పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా నులి పురు గులు రాకుండా నివారించవచ్చు. ఆరోగ్యవంతమైన సమాజం, ఆనందకర బాల్యం కోసం పిల్లల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించి విజయవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- సుధాకర్.ఏ.వి,
* రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
* స్టేట్ టీచర్స్ యూనియన్
తెలంగాణ స్టేట్ (STUTS)
* 9000674747



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
10.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఆరోగ్యానికి మేలు చేసే
టాప్ 10 పండ్లు
నారింజ
విటమిన్ C
సమృద్ధిగా
ఉంటుంది.
రోగనిరోధక శక్తిని
పెంచుతుంది.



## వైభవంగా మహారుద్ర చండీయాగం

**ముద్ర, కూకట్‌పల్లి :**



కూకట్‌పల్లిలోని శ్రీ హేమదుర్గమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సోమవారం మహారుద్ర చండీయాగం వైభవంగా నిర్వహించారు. అష్టమి తిథి కలసి వచ్చిన విశిష్ట పర్వదినాన్ని పురస్కరించుకుని, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌లకుమా దేవి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ హోమాన్ని నిర్వహించారు. లోక కల్యాణార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బండి రమేష్ దంపతులు తెలిపారు. శ్రీ హేమదుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి కుటుంబ సౌఖ్యం, సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి చేరాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ మహారుద్ర చండీయాగంలో బండి రమేష్ దంపతుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం వేద మంత్రోచ్చారణలు, హోమ ధూపాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## బూస్టర్ ఏర్పాటుతో త్రాగునీటి సమస్యకు పరిష్కారం

**ముద్ర, శేరిలింగంపల్లి :**

శేరిలింగంపల్లి డివిజన్‌లో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక చర్యలు చేపట్టారు. లోప్రెషర్ నీటి సరఫరాతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గోపినగర్, నెహ్రూనగర్, బాపునగర్ తదితర బస్తీలకు మెరుగైన త్రాగునీటి సదుపాయం కల్పించేందుకు నల్లగండ్ల ఫ్లైఓవర్ వద్ద హైప్రెజర్ బూస్టర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కొంతకాలంగా త్రాగునీరు తక్కువ ఒత్తిడితో సరఫరా కావడంతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను తమ దృష్టికి తీసుకురావడంతో, కార్పొరేటర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి గోపినగర్ గుట్ట ప్రాంతం, నెహ్రూనగర్ పరిసర బస్తీలకు హైప్రెజర్ త్రాగునీటి సరఫరా అందించేందుకు బూస్టర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈసందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే లోప్రెషర్ త్రాగునీటి సమస్యను అధిగమించామని చెప్పారు. శేరిలింగంపల్లి డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం నరేందర్, మేనేజర్ అభిషేక్ రెడ్డి, డివిజన్ గౌరవ అధ్యక్షుడు వీరేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు యాదా గౌడ్, వార్డు సభ్యురాలు పర్వీన్ బేగం, గఫూర్, విష్ణువర్ధన్ రెడ్డి, కొయ్యడ లక్ష్మణ్, రవి యాదవ్, రాజ్‌కుమార్, నరసింహ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



## గడపగడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తా

- **3వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పోలేమోని పద్మ కృష్ణ**

**ముద్ర, నారాయణ పేట :**

పట్టణంలోని 3వ వార్డులోని గడపగడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తానని కాంగ్రెస్ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పోలేమోని పద్మ కృష్ణ అన్నారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వార్డు పరిధిలో ముమ్మరంగా ఇంటింటికి తిరిగి హస్తం గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఏమి న్యాయం జరగలేదన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమం కాంగ్రెస్ ద్వారానే సాధ్యమవుతుందని పోలేమోని పద్మ కృష్ణ అన్నారు.

## వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



- **11వ వార్డులో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి డాక్టర్ భాగ్యలక్ష్మి ముమ్మర ప్రచారం**

**ముద్ర, నారాయణ పేట :**

పట్టణంలోని 11వ వార్డులో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి డాక్టర్ భాగ్యలక్ష్మి మల్లేష్ సింహం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం వార్డులో డోర్ టు డోర్ తిరిగుతూ ఓటర్లను కలుకున్నారు. వార్డులో ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కారం కోసం కృషి చేస్తానని డాక్టర్ భాగ్యలక్ష్మి హామీ ఇచ్చారు.

# వనపర్తిలో మున్సిపల్ వార్..!

- **కాంగ్రెస్ లో ముగ్గురు నేతల మధ్య అధిపత్య సమరం**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి :**




వనపర్తి జిల్లా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు తారాస్థాయికి చేరాయి. కొత్తగా శత్రువులు పుట్టకపోయినా, ఆధిపత్య పోరులో పార్టీ నేతలే పరస్పరం ప్రత్యర్థులుగా మారుతున్న పరిస్థితి నెలకొంది. అధిష్టానం జోక్యం చేసుకోకపోతే నష్టం తప్పదన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నా, నేతలు మాత్రం తమ దారిలో తాము ముందుకెళ్తున్నారు. ఈ పరిణామాలన్నీ వనపర్తి మున్సిపాలిటీలో కళ్లకు కట్టినట్లుగా దర్శనమిస్తున్నాయి. మాజీ మంత్రి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ జిల్లెల్ల చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి మధ్య కొన్నేళ్లుగా ఆధిపత్య పోరు కొనసాగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లోనే ఈ విభేదాలు కార్యకర్తలను విసిగించగా, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ అవే మళ్లీ బహిర్గతమయ్యాయి. అభ్యర్థుల ఎంపికలో ముగ్గురు నేతలు ఏకాభిప్రాయానికి రావాలంటూ కాంగ్రెస్ అధిష్టానం వార్నింగ్ ఇచ్చింది. దాంతో బహిరంగంగా ఐక్యత కనిపించినా, లోలోపల తమ తమ వర్గాల వారికే టికెట్లు దక్కాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంపిక పూర్తయ్యాక పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ఎమ్మెల్యే మేఘారెడ్డి, శివసేనారెడ్డి కొన్ని వార్డుల్లో కలిసి ప్రచారం నిర్వహిస్తుండగా, చిన్నారెడ్డి మాత్రం వారిని పక్కనపెట్టి ఒంటరిగా ప్రచారం సాగిస్తున్నారు. ఈ వ్యవహారం ఎమ్మెల్యే వర్గానికి ఆగ్రహం కలిగించిందన్న చర్చ నడుస్తోంది. "మీరు మీకు నచ్చినట్లు చేసుకోండి, కానీ ఓటమి వస్తే చర్యలు తప్పవు" అన్న సంకేతాలను పార్టీ అధిష్టానం పంపినట్లు సమాచారం. ఈ హెచ్చరిక చిన్నారెడ్డికి పెద్దగా ఇబ్బంది కాకపోయినా, ఎమ్మెల్యే మేఘారెడ్డికి మాత్రం రాజకీయంగా నష్టం జరిగే అవకాశం ఉందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. అందుకే వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి పెట్టి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మేఘారెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ అంతర్గత పోరులో కాంగ్రెస్ అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు.

**మున్సిపల్ ఎన్నికల్లో టగ్ ఆఫ్ వార్..**

వనపర్తి నియోజకవర్గంలోని వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీల్లో ఎన్నికలు తీవ్ర పోటీగా మారాయి. కాంగ్రెస్‌కు దీటుగా బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉంది. వనపర్తి మున్సిపాలిటీలోని 3వార్డుల్లో 25వార్డులు గెలుస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గులాబీ పార్టీ 30వార్డులు కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెబుతున్నారు. 2019లో నాగవరం, రాజానగరం, నర్సింగాయిపల్లి, శ్రీనివాసపురం గ్రామాలు వనపర్తి మున్సిపాలిటీలో విలీనమవడంతో పరిధి విస్తరించి 33వార్డులుగా విభజన జరిగింది. వీటిలో జనరల్ 8, జనరల్ మహిళ 8, బీసీ జనరల్ 6, బీసీ మహిళ 5, ఎస్సీ 2, ఎస్సీ మహిళ 3, ఎస్టీ జనరల్ 1 స్థానాలకు రిజర్వేషన్ ఉంది. మున్సిపాలిటీ అధికారం దక్కాలంటే మేజిక్ ఫిగర్ 17స్థానాల్లో విజయం సాధించాలి. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం వనపర్తిలో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ తరపున మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఒక్కడే 'ఏక్ నిరంజన్'లా ప్రచారంలో దూసుకుపోతున్నారు. పలు వార్డుల్లో భారతీయ జనతా పార్టీ కూడా బలమైన అభ్యర్థులతో బరిలోకి దిగింది. ఐదు నుంచి పది స్థానాల్లో గెలిచి చైర్మన్ ఎన్నికలో కింగ్‌మేకర్‌గా మారతామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక 22వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉండటం విశేషం. కొందరికి బలమైన క్యాడర్ ఉండటంతో పార్టీ అభ్యర్థులకు గట్టి పోటీ ఇస్తున్నారు. వీరి ప్రభావంతో కొన్ని వార్డుల్లో ఫలితాలు తారుమారయ్యే అవకాశం కనిపిస్తోంది. అదే జరిగితే మున్సిపల్ చైర్మన్ ఎంపికలో స్వతంత్ర అభ్యర్థులు కీలక పాత్ర పోషించే పరిస్థితి తలెత్తవచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా తమ తమ గెలుపుపై ధీమాతో ఉన్నారు.

# కేపీహెచ్‌బీలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- **పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కృష్ణారావు**

**ముద్ర, కూకట్‌పల్లి :**



నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం కేపీహెచ్‌బీ డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించడంతోపాటు, పలు కొత్త పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈసందర్భంగా కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని దోబీఘాట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, రజకుల సౌకర్యార్థం ఫ్లోరింగ్, వాటర్ పైప్‌లైన్, ఎలక్ట్రికల్ పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దోబీఘాట్‌ను ఆధునీకరించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం భగత్‌సింగ్‌నగర్ ఫేజ్ 1లో పర్యటించి, అక్కడ చేపట్టనున్న నూతన రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, స్థానికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. తదుపరి కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లోని మహిళా మండలి భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, మహిళల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవనంపై మొదటి అంతస్తు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌ను ఆదర్శంగా అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, పార్టీ నాయకులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.







# 'పేట'లో బీజేపీ ప్రచార హోరు..

**ముద్ర, నారాయణపేట :**





మున్సిపల్ ప్రచారానికి సోమవారం చివరి రోజు కావడంతో బీజేపీ అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించారు. 4వ వార్డులో కొండా శ్వేతా సత్య యాదవ్, 21వ వార్డులో కమలాపూర్ ప్రభాకర్, 10వ వార్డులో సిద్ది విశాలాక్షి వెంకట్ రాములు, 16వ వార్డులో కమలాపూర్ అంబికా శ్రీనివాస్, 1వ వార్డులో సుతారి సత్య రఘుపాల్ వార్డుల్లో తిరుగుతూ కమలం గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

**4వ వార్డులో..**

కమలం గుర్తుకు ఓటు వేసి బిజెపిని గెలిపించాలనీ 4వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి కొండా శ్వేతా సత్య యాదవ్ కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మాజీ కౌన్సిలర్ నవలే విజయ్ తో కలిసి ముమ్మరంగా గాంధీనగర్లో ప్రచారం నిర్వహించారు.

**16వ వార్డులో..**

కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే వార్డు ప్రజలకు సేవ చేస్తానని, బిజెపి ద్వారానే అభివృద్ధి సాధ్యమని 16 వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కమలాపూర్ అంబికా శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు.

**21వ వార్డులో..**

21వ వార్డు ఓటర్లు తప్పనిసరిగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి కమలాపూర్ ప్రభాకర్ ఓటర్లను కోరారు. సోమవారం వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించి బిజెపి ప్రభుత్వ సంక్షేమ పథకాలు.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు.

**10వ వార్డులో..**

పట్టణంలోని 10వ వార్డు అభివృద్ధి కోసం బిజెపికి ఓటు వేసి గెలిపించాలని కౌన్సిలర్ అభ్యర్థి సిద్ది విశాలాక్షి వెంకట్ రాములు, వార్డు ఇంచార్జ్ జ్యోతి సాయిబన్న ఆధ్వర్యంలో సోమవారం ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

**1వ వార్డులో..**

ఒకటో వార్డులో నెలకొన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సుతారి సత్య రఘుపాల్ అన్నారు. సోమవారం ఒకటవ వార్డు పరిధిలో మాజీ కౌన్సిలర్ అనూష చిన్న రఘుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 10-02-2026
www.mudranews.in | @mudranews



ఆరోగ్యానికి మేలు చేసే టాప్ 10 పండ్లు

బొప్పాయి

జీర్ణ సమస్యలకు ఉత్తమ ఔషధం. చర్మ ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది.



## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**- కలెక్టర్ అభిలాష అభినవ్**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
ఓటు మన హక్కని, మున్సిపల్ ఎన్నికలలో స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి, ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ జండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత తెలిపేలా నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన వరమన్నారు. ఎన్నికలు ఏవైనా అందరూ ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలన్నారు. ఇటీవలి గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని స్ఫూర్తిని చాటారని వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో సైతం ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందాల ద్వారా వార్డుల వారీగా ఓటు హక్కుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, సిపిఓ జీవరత్నం, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, డీఈవో భోజన్న, ఎక్సైజ్ అధికారి ఎంఎ రజాక్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### ఓట్ల లెక్కింపుపై అవగాహన కలిగి ఉండాలి

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి తమ బాధ్యతలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఓటు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ సందేహాలుంటే అధికారులను సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

## అవినీతి, కమీషన్లు లక్ష్యంగా ప్రభుత్వ పాలన

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
రాష్ట్రంలో అవినీతి పెచ్చుపెరిగి పోయిందని, కమీషన్లు లక్ష్యంగా పాలన కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. పట్టణాల అభివృద్ధి జరగాలంటే, అవినీతి రాజ్యం అంతరించాలన్నా బీజేపీ అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరి రోజు సోమవారం నిర్మల్ లో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్ఏ ఏలేటి మహేశ్వర్ రెడ్డి నివాసం నుంచి జాతీయ రహదారి మీదుగా ర్యాలీ కొనసాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలనలో పారదర్శకత లోపించిందని అన్నారు. గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇపుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతి మయంగా పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. గత సర్కారు కమిషన్లతో కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో అవకతవకలకు పాల్పడిందని, ప్రస్తుత ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ పై ఆరోపణలు చేస్తోందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎంఐఎం పార్టీతో కుమ్మక్కయ్యాయని అన్నారు. బీజేపీ అభ్యర్థులను ఓడించేందుకు ఆ మూడు పార్టీలు చేయని ప్రయత్నమంటూ లేదని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల అమలు ఇప్పటికీ పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంటే, వాటి పేర్లు మార్చి తమ ఖాతాలో వేసుకుంటున్నాయన్నారు. సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్ తమ పార్టీ లక్ష్యమని అన్నారు. చోర్ వర్గ పాలనకు చరమ గీతం పాడేందుకు ఈ ఎన్నికలు మంచి అవకాశమన్నారు. నిర్మల్ జిల్లాలోని పురపాలికల్లో బీజేపీ అధికారం చేపట్టేలా ప్రజలు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, రామ్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ సందర్భంగా ప్రచార కార్యక్రమాలపై నిషేధం

**- పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా మద్యం దుకాణాలు మూసివేయాలి. .**
**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి**

**ముద్ర, కరీంనగర్:**
మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ మున్సిపల్ ఎన్నికలు జరగనున్న పరిధిలో సోమవారం (ఫిబ్రవరి 9) సాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో



ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు.

## కాంగ్రెస్ బలపరిచిన సిపిఐ అభ్యర్థిని గెలిపించండి

**- భూ కబ్జాలు చేసే బీఆర్ఎస్, మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీ అభ్యర్థులను ఓడించండి**
**- మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**

**ముద్ర, కరీంనగర్:**
గత ప్రభుత్వ హయాంలో భూ కబ్జాలకు పాల్పడిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను, నిత్యం మతాల మధ్య, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీ అభ్యర్థులను మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఓడించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ అభ్యర్థి లతశ్రీ కసిరెడ్డిని గెలిపించాలని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా సోమవారం 57వ డివిజన్ గణేష్ నగర్ లో ఎమ్మెల్యే సత్యనారాయణ ఇంటింటా ప్రచారం చేశారు.



ఈ సందర్భంగా సిపిఐ కార్యాలయం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో బీజేపీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మోసం చేసిం దని, నల్ల డబ్బు వెలికి తీసి ప్రజలకు అందిస్తామని వాగ్దానాలు ఇచ్చి మరిచిపోయిందని, నరేంద్ర మోడీ ప్రధానిగా ఉన్న సమయంలోనే పార్లమెంటుపై దాడి జరిగిందని, కాశ్మీర్లో కాల్పులు జరిగాయని, పక్కనున్న చైనాతో గాని శ్రీలంకతో గాని ఏ ఇతర దేశాలతో కూడా మోడీ ప్రభుత్వం సఖ్యతగా లేదని, కాంగ్రెస్ హయాంలో ఎలాంటి దాడులు జరగలేదని అన్నారు. బండి సంజయ్ నోరు విప్పితే హిందువులమని ప్రగల్భాలు పలుకుతాడని, ఓట్లపుడే హిందువులు గుర్తుకు వస్తారని, ఇక్కడ నివసించే వారంతా హిందువులు కాదా, దేవుళ్లను మొక్కడం లేదా ఆయన కంటికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రజాపాలన అందిస్తున్నామని, మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, గణేష్ నగర్ లో మహిళా సంఘాల వారికి మహిళా భవనం మంజూరుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, డివిజన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ అభ్యర్థి లతశ్రీ కసిరెడ్డిని భారీ మెజారిటీతో కార్పొరేటర్ గా గెలిపించాలని ఓటర్లను కోరారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అభ్యర్థి లత శ్రీ కసిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ ఎంపీపీ ఉట్కూరి వెంకటరమణ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, పున్నం మహేశ్, మల్లిఖార్జున శైలజ, పోకల లక్ష్మీనారాయణ, కాళిదాసు రేణుక, నందికొండ అంజిరెడ్డి, సిపిఐ నాయకులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమళ్ళ సమ్మయ్య, న్యాలపట్ల రాజు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, మణికంఠ రెడ్డి, మచ్చ రమేష్, రామారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

### "ప్రాథమిక అభ్యాస అధ్యయనం"
## మోడల్ పరీక్షలు నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**ముద్ర, కరీంనగర్:**
ప్రాథమిక పాఠశాల విద్యార్థుల చదువును అంచనా వేసే "ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ"లో భాగంగా విద్యార్థులకు మాక్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గోపాలపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. 3వ తరగతి విద్యార్థులతో గణితం, ఆంగ్ల పాఠాలు చదివించారు. ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీకి సంబంధించిన మోడల్ టెస్ట్ పేపర్లలోని పలు ప్రశ్నలను అడుగుతూ విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల నోట్ బుక్ లో రైటింగ్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీలో భాగంగా జిల్లాలోని ఏ పాఠశాలలోనైనా విద్యార్థులకు ర్యాండమైజేషన్ విధానంలో పరీక్షలు జరుగుతాయని, అందువల్ల ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధతో ఎఫ్.ఎల్.ఎస్ కి సిద్ధం చేయాలని అన్నారు. విద్యార్థులకు తరచూ మాక్ టెస్టులు నిర్వహించాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు ఎప్పటికప్పుడు ఈ అంశంపై సమీక్ష నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. బుధవారం బోధన కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ కఠినమైన పాఠాల పట్ల దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యా సంవత్సరం కొద్దికాలమే ఉన్నందున ప్రతి విద్యార్థిపై శ్రద్ధ తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి వాసవి పాల్గొన్నారు.

## అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

**- ఐటిడిఎ పీవో యువరాజ్ మార్మాట్**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ అధికారులను ఆదేశించారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్, కడెం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, కడెం బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. విద్య, వైద్యం, భోజన ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి భోజన నాణ్యత, సమయపాలనపై ప్రశ్నించారు. వండిన ఆహారాన్ని పరిశీలించి కంప్యూటర్ ల్యాబ్ ను తనిఖీ చేశారు. కడెం ఆశ్రమ పాఠశాలలో 170 మంది విద్యార్థుల్లో 115 మంది మాత్రమే హాజరై ఉండగా, హాజరు నమోదు తప్పుగా చేయడంపై వార్డెన్ ను హెచ్చరించారు. దస్తురాబాద్ పాఠశాలలో పల్స్ యాప్ అప్ డేట్ చేయకపోవడం, నెట్ వర్క్ కారణాలు చూపడం, తక్కువ మోతాదులో భోజనం అందించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పల్స్ యాప్ పనితీరుపై సమీక్షించి, సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు నివారించేందుకు వసతి గృహాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పి, సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు.

## రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగింపు



**ముద్ర, మంచిర్యాల:**
మహా శివరాత్రి సందర్భంగా ఆలయానికి భక్తులు వచ్చే మార్గంలో ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కోమటిచేను గ్రామ పంచాయతీ పరిధిలోని వరిపేట శివారు మీదుగా శివాలయం వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెద్ద ఎత్తున పెరిగాయి. రహదారిపై పెరిగిన పిచ్చి మొక్కలను సోమవారం జేసీబీతో తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాడి మాణిక్య శంకరయ్య, ఉప సర్పంచ్ కొడప అనంత రావు, వార్డ్ సభ్యులు సరోజ, గుండేటి నర్సయ్య తదితరులు పనులను పరిశీలించారు.

## కుష్టువ్యాధి నివారణకు ఉచిత మందులు

**- పెద్దపల్లి జిల్లా పారామెడికల్ అధికారి దేవి సింగ్**



**ముద్ర, పెద్దపల్లి:**
కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులు ఇస్తుందని పెద్దపల్లి జిల్లా పార మెడికల్ అధికారి బీ దేవి సింగ్ అన్నారు. కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని 15 రోజులు నిర్వహించే స్లాక్ అనే కార్యక్రమం ద్వారా మండల కేంద్రంలోని వాసవి డిగ్రీ కళాశాలలో కుష్టు వ్యాధి నివారణపై విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవి సింగ్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి వస్తే ప్రారంభ దశలోనే గుర్తించి ఎండిటీ అనే బహుళ ఔషధ చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఈ మందులు ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. శరీరంపై మొద్దు బారిన మచ్చలు ఏర్పడి అవి రాగి రంగులో ఉంటాయని తెలిపారు. చర్మం పాలిపోయినట్లు ఉండి మచ్చలపై చెమట రాకుండా ఉండడంతోపాటు చర్మం కంటే మచ్చలు ఉబ్బెత్తుగా ఉంటాయన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్నటువంటి వారు కేంద్రంలో డాక్టర్ ను సంప్రదించి మందులు వాడినట్లయితే ఎలాంటి అంగవైకల్యం రాకుండా పూర్తిగా తగ్గిపోతుందని దేవి సింగ్ వివరించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాస్, మహేందర్, సత్యనారాయణ రావు, హెచ్ఈఓ శ్రీనివాస్ వినీత్, కళాశాల ప్రిన్సిపాల్ జక్కుల కుమార్, ఏఎన్ఎం సూత్రాల సరోజన, ఆశా కార్యకర్తలు శారద, భూలక్ష్మి , విద్యార్థులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు

**- పోలీసు కమీషనర్ గౌస్ ఆలం**



**ముద్ర, కరీంనగర్:**
నగరంలో, జిల్లాలోని పలు మున్సిపాలిటీలలో ఈ నెల 11వ తేదీన జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ (గతంలో 144 సెక్షన్) విధిస్తూ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ ఆలం ఉత్తర్వులు జారీ చే శారు. ఈ ఉత్తర్వుల ప్రకారం పైన పేర్కొన్న ప్రాంతాల్లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడటంపై నిషేధం ఉంటుంది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల పరిధిలో ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. 10వ తేదీ ఉదయం 6 గంటల నుండి 12వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏదైనా చట్టబద్ధమైన సమావేశాలు లేదా కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తే, సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగ కుండా, శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని కమీషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపర మైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగు తుందని ఆయన హెచ్చరించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
10.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఆరోగ్యానికి మేలు చేసే టాప్ 10 పండ్లు**

దానిమ్మ రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. హృదయ రోగాల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.





## యాదగిరిని గెలిపించాలని ప్రచారం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

డబ్బు, ఇతర ప్రలోభాలకు లొంగకుండా ప్రజల కోసం నిరంతరం పనిచేసే 4వ వార్డు సిపిఎం అభ్యర్థి వడ్డేపల్లి యాదగిరికి ఓట్లు వేసి గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ వార్డు ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో నిరంతరం ఉద్యమాలు చేపడుతున్న ఉద్యమాలలో కీలకంగా పనిచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి వడ్డేపల్లి యాదగిరి, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు కోట రామచంద్రారెడ్డి, మాజీ జిల్లా కమిటీ సభ్యులు పగిళ్ల లింగారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, ప్రసాదం విష్ణు, గూడూరు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ చేసినందుకు ఓటు వేయాలా?

- **నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి**

**ముద్ర, నల్లగొండ:**



పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోపిడి చేసినందుకు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలా అని నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి ఎనిమిది లక్షల కోట్ల అప్పుల్లో ముంచినందుకు వారికి ఓటు వేయాలా అని అన్నారు. టిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక ఇల్లు కానీ, ఒక ఇంటి స్థలం కానీ ఇవ్వలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల బాధలను అర్థం చేసుకునేది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని, పేదలు ఆత్మగౌరవంతో తలెత్తుకొని జీవించేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను రాష్ట్రంలో మొదటి దశలో నాలుగున్నర లక్షల నిర్మాణం జరుగుతుందని అన్నారు. దీనికోసం రూ. 22,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ కార్డులను మంజూరు చేశామని, రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా 1.02 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. మహిళలు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పించామని, 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## ట్రంప్, మోడీ దిష్టిబొమ్మల దహనం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోడీలు ఇరుదేశాల మధ్యన చేసుకున్న ఒప్పందాలు భారతీయ ఉత్పత్తులపై తీవ్రమైన ప్రభావం చూపనున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి అన్నారు. సోమవారం బీబీనగర్ బ్రాహ్మణపల్లి రోడ్డులో సిఐటియు ఆధ్వర్యంలో ట్రంప్, మోడీ ల దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ మనం దేశం నుండి అమెరికాకు ఎగుమతి చేసే వ్యవసాయ ఉత్పత్తులు, పారిశ్రామికోత్పత్తుల పైన ఎక్కువ సుంకాలు వేస్తూ, అదే అమెరికా నుండి మన దేశానికి దిగుమతి చేసుకునే వ్యవసాయ ఉత్పత్తుల పైన, పారిశ్రామిక ఉత్పత్తుల పైన సుంకాలు లేకుండా వాణిజ్య ఒప్పందం చేసుకోవడం దేశ ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టం వాటిల్లనున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పొట్ట యాదమ్మ, నాయకులు ఓవల్దాసు సతీష్, గాడి శ్రీనివాస్, పురుషోత్తం, పాష, కుమార్, కీమా, అంజు, నోముల మల్లారెడ్డి, స్వామి, నాగరాజు, లోకదాస్ పవన్, గొలనుకొండ వెంకటేశం పాల్గొన్నారు.






## మున్సిపల్ ఎన్నికలకు అంతా సిద్ధం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, చౌటుప్పల్, మోత్కూర్ మున్సిపాలిటీలకు జరుగనున్న ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, న్యాయంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హనుమంత రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని నిబంధనలను అనుసరించి ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల ప్రచారం కూడా సోమవారం సాయంత్రంతో ముగిసిందని, ఓటర్లకు నగదు, మద్యం, బహుమతులు వంటి ప్రలోభాలు పూర్తిగా నిషేధమని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



## కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించండి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

మున్సిపల్ ఎన్నికలలో భువనగిరి పట్టణంలోని 10వ వార్డు హౌసింగ్ బోర్డు కాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బింగి నరేష్ సోమవారం ప్రచారం ఇంటింటి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తోనే వార్డ్ అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్, బద్దం వాసు దేవ్ రెడ్డి, అమనాథ్ పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పరిశీలన

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు సోమవారం పరిశీలించారు. ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సోమవారం సాయంత్రం కల్లా ముగుస్తుందని తెలిపారు. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్యన కౌంటింగ్ హాల్ కు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

- **భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్పెషల్ ఆఫీసర్స్, మున్సిపల్ కమిషనర్లకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. అధికారులంతా బాధ్యతతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో లు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, అడిషనల్ డి.ఆర్.డి.ఓ సురేష్, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## సమ్మె విజయవంతం చేయాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరూతూ..బీబీనగర్ మండలంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సోమవారం మండలంలోని హిందుస్థాన్, ఎం ఎస్ ఎన్ ఆర్గానిక్స్, మంచుకొండ ప్రకాష్ స్తంభాల కంపెనీ లలోని కార్మికులను సిఐటియు నాయకత్వం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓవల్దాస్ సతీష్, గాడి శ్రీనివాస్, లోకదాసు పవన్, సిద్దు పాల్గొన్నారు



## సరిత మల్లేశంను గెలిపించుకోవాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపల్ ఎన్నికలలో 28వ వార్డు బి.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థి గుమ్మల సరిత మల్లేశంను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని ఆ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లేష్ ఓటర్లను కోరారు. సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డ్ ఇన్చార్జ్ డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, జనగాం పాండు, తాజ్పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, చిందం మల్లిఖార్జున్, శెట్టి బాలయ్య యాదవ్, బల్గురి మధుసూదన్ రెడ్డి, జక్క రాఘవేందర్ రెడ్డి, కేశవపట్నం రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మినీ మీటింగ్ హాల్ లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో పరీక్షల నిర్వహణకు 28 కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రథమ సంవత్సరం 6550 మంది ద్వితీయ సంవత్సరం 6263 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుందని, 8 గంటల వరకే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణ సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీ నారాయణ, భువనగిరి ఆర్డీఓ కృష్ణా రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, జిల్లా అసిస్టెంట్ ట్రెజరీ అధికారి మోహన్ రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## భవిష్యత్ తరాలకు గుర్తుండిపోయేలా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ముద్ర, ఆత్మకూర్(ఎం):**

తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతుగా భవిష్యత్ తరాలకు గుర్తుండిపోయే విధంగా ఏదో ఒక సహాయం చేయాలని 1988-89 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు నిర్ణయించారు. పదో తరగతి చదివి 37 సంవత్సరాలు పూర్తవడంతో పాటు వ్యక్తిగత వయస్సు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మకూరు లో ప్రత్యేకంగా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఆత్మకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసినందులకు కృతజ్ఞతాపూర్వకంగా చిరస్థాయిగా, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా ఉండే విధంగా వితరణ అందించాలని పూర్వ విద్యార్థులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమ పూర్వ విద్యార్థులు మండలంలోని మొరిపిరాల గ్రామ ఉప సర్పంచ్ గా ఎంపికైన యాస జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా జిల్లా ఉత్తమ కమ్యూనిటీ కోఆర్డినేటర్ అవార్డు అందుకున్న లోడి భాస్కర్ ను ఈ సందర్భంగా బాల్య మిత్రులు శాలువాతో సన్మానించి మెమెంటోతో సత్కరించారు.

## ప్రజా సేవే లక్ష్యం

**ముద్ర, మోత్కూర్:**

ప్రజా సేవే లక్ష్యంగా పోటీ చేస్తున్న మోత్కూర్ మున్సిపాలిటీ ఒకటో వార్డు అభ్యర్థి పల్లెర్ల వెంకన్నకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేతి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## స్వర్ణగిరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యార్చనలు పూర్తి చేశారు. అనంతరం వైనతేయ హవనం జరిపి బంగారు ధ్వజస్థంభం మీద గరుడ పటాన్ని ఎగురవేశారు. సంతానం లేని దంపతులకు గరుడ ప్రసాదాన్ని అందించారు. శ్రీ రంగం క్షేత్రం నుండి శేష వస్త్రం పుష్ప మాలికలను అక్కడి ప్రధానార్చకులు మురారి భట్టర్ స్వామి వారు స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సమర్పించారు. సోమవారం అగ్ని ప్రతిష్ఠ, మూర్తి కుంభారాధన, ధ్వజారోహణం (గరుడ పట ఆవిష్కరణ), వైనతేయ హవనం, ఇష్టి, పల్లకీ సేవతో స్వామివారి దివ్య దర్శనం ఘనంగా నిర్వహించారు.



**ఆరోగ్యానికి మేలు చేసే టాప్ 10 పండ్లు**



జామకాయ విటమిన్ C, ఫైబర్ అధికంగా ఉంటాయి. డయాబెటిస్ నియంత్రణకు ఉపయోగకరం.



# ఎన్నికల నియమావళిని పాటించాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, వారి అనుచరులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ ఒక ప్రకటనలో సూచించారు. బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, బ్యానర్లు ప్రదర్శించడం, సోషల్ మీడియా ద్వారా ఎన్నికల ప్రచారం, ఓటర్లకు నగదు, మద్యం, బహుమతులు వంటి ప్రలోభాలు పూర్తిగా నిషేధమని తెలిపారు. మెదక్, తూప్రాన్, రామాయంపేట, నర్సాపూర్ మున్సిపాలిటీలకు స్వేచ్ఛాయుతంగా, న్యాయంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఓటర్లు తప్పకుండా తమ విలువైన ఓటును వినియెగించుకోవాలని సూచించారు.

**రేపు సెలవు..**

మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచన ప్రకారం బుధవారం ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులకు సాధారణ సెలవు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల ప్రాంతంలోని షాపులు, సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఉపయోగించే ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థల భవనాలకు ఈ నెల 10న పోలింగ్ కు ముందు రోజు, 11న పోలింగ్ రోజు, 13న ఓట్ల లెక్కింపు తేదీల్లో సెలవును ప్రకటించినట్లు పేర్కొన్నారు. అందుకు తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు

# ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలి

- జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**





ఎన్నికల్లో అత్యంత కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని మైక్రో అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించాలని జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్ సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు.

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సూక్ష్మ స్థాయిలో పరిశీలించేందుకు నియమించబడ్డ మైక్రో అబ్జర్వర్లకు సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల సాధారణ పరిశీలకులు ఉదయ్ కుమార్ హాజరై మైక్రో అబ్జర్వర్లకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు పరిశీలకులుగా మాత్రమే వ్యవహరించాలన్నారు. ఓటింగ్, కౌంటింగ్ రోజుల్లో పూర్తి స్థాయి ప్రక్రియను గమనించి నివేదికలను లిఖితపూర్వకంగా సమర్పించాలని ఆదేశించారు. మైక్రో అబ్జర్వర్లు తమ విధులు, బాధ్యతల పరిధి లోనే పనిచేయాలని సూచించారు.

అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరించి ఆయా మున్సిపాలిటీల పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లకు బాధ్యతలు కేటాయిస్తామని తెలిపారు. పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై మైక్రో అబ్జర్వర్లు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను సమర్థవంతంగా పరిశీస్తారని పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా జరుగుతోందా లేదా అన్నది నిశితంగా పరిశీలించాలన్నారు. గమనించిన అంశాలను వెంటనే జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ పూర్తయ్యే వరకు అన్ని అంశాలను జాగ్రత్తగా గమనిస్తూ ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైక్రో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.

మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్ మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ శిక్షణ తరగతుల్లో ఎన్నికల శిక్షణల నోడల్ అధికారి రామాచారి, డీఈఓ వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ నర్సింగ్, మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను వివరించాలి

- మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కోరారు. ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీలోని 9వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి తుపాకుల మీనా, 4 వ వార్డు అభ్యర్థి తిరుమల కల్పన, 5వ వార్డు అభ్యర్థి కొత్తగొల్ల మాధవి, 6వ వార్డు అభ్యర్థి రాచకొండ జ్యోతి, 8వ వార్డు అభ్యర్థి బండ్ల సంతోష్, 1వ వార్డు అభ్యర్థి గడ్డి అరుణ్ కుమార్ కు మద్దతుగా సోమవారం ఆయా వార్డుల్లో మంత్రి పాదయాత్రగా ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో ఓటర్లను కలిసి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మున్సిపాలిటీలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, రేషన్ కార్డుల జారీ, ఉచిత బస్సు ప్రయాణం లాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. ఆందోల్ జోగిపేటలో 150 పడకల ఆధునిక ఆసుపత్రి నిర్మాణం, నర్సింగ్ కాలేజీలు, పాలిటెక్నిక్ కాలేజీలు, కేజీబీవీలు మోడల్ స్కూల్ లతో విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. స్థానికంగా మహిళలకు ఉపాధి కల్పించేందుకు కుటీర పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రచారంలో ఓటర్ల నుంచి విశేష స్పందన వస్తుందని మంత్రి వెల్లడించారు. ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ అఖండ మెజార్టీతో కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, డాకురి వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేందర్ గౌడ్, పీసీసీ కమిటీ పర్యవేక్షకులు కైలాష్ కుమార్, 20వ వార్డు అభ్యర్థి ఎస్.కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ వివిధ మండలాల శేషారెడ్డి, చిట్యాల మధు, గుర్రం కృష్ణ, కుమ్మరి క్రిష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# కాంగ్రెస్ బెదిరింపులకు భయపడొద్దు

- మాజీ మంత్రి హరీష్ రావు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

తమ పార్టీ అభ్యర్థులు గెలవకుంటే బిల్లులు రావనే కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు భయపడొద్దని మాజీ మంత్రి హరీష్ రావు ప్రజలకు సూచించారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంతో పాటు రామాయంపేట, నర్సాపూర్ లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ లో చిల్లర బెదిరింపులకు ఎవరు భయపడరని హెచ్చరించారు. బిల్లులు మీ జేబుల నుంచి ఇస్తున్నారా? మీ జాగిరా? అని నిలదీశారు. బరాబర్ బిల్లులు వస్తయని, కొట్లాడి సాధించుకుంటామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ చేసింది గుండు సున్నా అని విమర్శించారు. సీఎం మిర్యాలగూడ, భూపాలపల్లి, నిజామాబాద్ పోయిండు, కానీ మెదక్ కు వచ్చేందుకు ముఖం లేదన్నారు. ఏడుపాయల అమ్మవారి మీద ఒట్టు వేసి మాట తప్పిండు కాబట్టి ఆయనకు భయం ఉందన్నారు. సీఎం రుణ మాఫీపై మాట తప్పి మోసం చేశారన్నారు. రైతు బంధు ఎగ్గొట్టిండు, ఎరువుల కరువు తెచ్చారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడటం తప్ప ఒక్క మంచి పని చేయలేదన్నారు. రంజాన్ తోఫా కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. షాదీ ముబారక్ చెక్కులు రావడం లేదని, తులం బంగారం దిక్కు లేదన్నారు.

తాము బీజేపీతో జత కట్టమని స్పష్టం చేశారు. కేసీఆర్ వీఆర్ఎస్ ను సెక్యూలర్ పార్టీగా నిలబెట్టారని అన్నారు. హిందూ ముస్లింలను అన్నదమ్ములుగా చూస్తామన్నారు. కేసీఆర్, హరీశ్ రావును తిడితే పేదల కడుపు నిండుతుందా అని ప్రశ్నించారు.

ఇక్కడి ఎమ్మెల్యే చాలా గొప్పోడన్నారు. ఎన్నికల సమయంలో 24 గంటల కరెంటు ఇస్తా అన్నరని, కనీసం 12 గంటలు కూడా రావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఏడాదికి 12వేలు అని గుండు కొట్టారన్నారు. ఉద్యోగస్తులకు డీఏ లేదు, పీఆర్సీ లేదన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ పిలల చదువులను ఆగం చేశారన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అని మోసం చేశారన్నారు. ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు పోవడం ఖాయమన్నారు. అందుకే ఫోరెన్సిక్ ల్యాబ్ ను దగ్దం చేయించారని ఆరోపించారు.

మాజీ డిప్యూటీ స్పీకర్, జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో మాజీ ఎమ్మెల్సీలు ఫారుక్ హుస్సేన్, సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, మల్లిఖార్జున గౌడ్, బట్టి జగపతి, సురేందర్ గౌడ్, మామిళ్ల ఆంజనేయులు, కృష్ణారెడరెడ్డి తోపాటు కౌన్సిలర్ అభ్యర్థులు, నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

**మెదక్ లో భారీ ర్యాలీ..**

మెదక్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ముగింపు సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఐ గ్రౌండ్ నుంచి బస్టాండ్, పోస్ట్ ఆఫీస్ సర్కిల్, పోలీస్ స్టేషన్, చిల్డ్రన్స్ పార్క్ మీదుగా రాందాస్ చౌరస్తా వరకు సాగింది. పట్టణమంతా గులాబీ మాయమైంది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

# మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**



మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సిద్దిపేట కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కే. హేమావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 11న జిల్లాలోని హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నట్లు చెప్పారు. పోలింగ్ తో పాటు 13న జరుగనున్న ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నాలుగు మున్సిపాలిటీలలో మొత్తం 72 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయని, ఇందుకు 176 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 1069 మంది పోలింగ్ సిబ్బందిని నియమించామని తెలిపారు. మొత్తం 18 రూట్లను 22 మంది జోనల్ అధికారులను నియమించామ న్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేస్తున్నామని చెప్పారు. 31 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి 31 మంది మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వంద శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని మున్సిపాలిటీలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ రిసెప్షన్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు పోలింగ్ సిబ్బందికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 13 న ఎన్నికల ఓట్ల లెక్కింపునకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 14 టేబుళ్లు, మిగతా మూడు మున్సిపాలిటీల్లో 7 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశామని తెలిపారు.

# చిన్నారులకు యూనిఫాంల పంపిణీ

**ముద్ర, హైదరాబాద్:**



నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం ఏత్తొండ క్యాంప్ అంగన్ వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి వీర మణి మాట్లాడుతూ చిన్నారులు పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అంగన్ వాడీ కేంద్రంలో గర్భిణీ, బాలింతలకు ప్రతీ రోజు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఎంతమంది ఉన్నారని స్థానిక టీచర్ పద్మశ్రీని అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడీ కేంద్రం చాలా బాగుందని ,విద్యార్థుల సంఖ్య కూడా బాగుందని టీచర్ను సర్పంచ్ అభినందించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మొత్తి పేట రాజు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మేలు చేయని బీఆర్ఎస్

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు
- మెదక్ కాంగ్రెస్ భారీ ర్యాలీ

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు దోచుకుని, దాచుకున్నారు తప్ప ప్రజలకు మేలు చేసే పనులు చేయలేదని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు.

పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు మెదక్ ను అభివృద్ధి చేయని వారు ఇప్పుడు గెలిస్తే ఏమి చేస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏమి జరిగిందో ఆయన కూతురు కవిత ప్రతి రోజూ చెబుతోందన్నారు. ప్రజలను మోసం చేయడానికి బీఆర్ఎస్ నాయకులు మళ్లీ వస్తూ మాయ మాటలు చెబుతున్నారని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు ఇచ్చే పైసలు తీసుకొని చేయి గుర్తుపై ఓటేయాలన్నారు. మెదక్ మున్సిపాలిటీ మీద కాంగ్రెస్ జెండా ఎగురావేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందని, ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తోందని గుర్తు చేశారు. మెదక్ అభివృద్ధి కాకుండా ఉండటానికి కారకులైన మాజీ మంత్రి హరీష్ రావు మళ్లీ మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. మన నిధులు హరీష్ రావు గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లకు తరలించారని ఆరోపించారు. ఇప్పుడిడిప్పుడే అభివృద్ధి చెందుతోందన్నారు. కాంగ్రెస్ వచ్చాక రేషన్ కార్డులు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని చెప్పారు. తాము రెండేళ్లలో రెండు వేల కోట్లు తెచ్చామన్నారు. ప్రతి గ్రామంలో సన్నబియ్యం ఇస్తున్నమని చెప్పారు. ఇందిరమ్మను గెలిపించిన జిల్లా అన్నారు.

తాను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు శంకరంపేటకు ఫ్యాక్టరీలు తెచ్చానని గుర్తు చేశారు. ఏడుపాయల అభివృద్ధికి సీఎం రేవంత్ రూ. 35 కోట్లు ఇచ్చారని పేర్కొన్నారు. మెదక్ చర్చికి రూ. 30 కోట్ల అభివృద్ధి నిధులు వెచ్చించామని, మెదక్ లో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు ఇచ్చామని, ఖిల్లా అభివృద్ధికి రూ. 4 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభివృద్ధికి హరీష్ రావు అడ్డు పడుతున్నారని ఆరోపించారు. రెండు నెలల్లో కొత్త పెన్షన్లు వస్తాయని తెలిపారు. 500 ఇళ్లు ఇస్తామని మంత్రి చెప్పారన్నారు. మూడేళ్ల లో మరో రూ. 3వేల కోట్లు తెస్తానని తెలిపారు. ఈ సభలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, బొజ్జ పవన్ తదితరులు పాల్గొన్నారు.





ఆరోగ్యానికి మేలు చేసే టాప్ 10 పండ్లు

మామిడి

విటమిన్ A సమృద్ధిగా ఉంటుంది. కళ్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.



# ‘పరీక్షా పే చర్చ’లో మోదీ మంత్రం

- తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ విద్యార్థులతో ప్రధాని సంభాషణ
- నాయకత్వం అంటే సేవ.. ఎన్నికలు కాదు
- ఏఐకి భయపడొద్దు.. టెక్నాలజీని అర్థం చేసుకోండి
- పరీక్షల ఒత్తిడికి నిద్ర, క్రీడలు కీలకం
- నాయకత్వం నుంచి ఏఐ వరకూ విద్యార్థులకు దిశానిర్దేశం

**ముద్ర న్యూస్:**



దేశ వ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చ 9వ ఎడిషన్‌లో భాగంగా రెండో సెషన్ సోమవారం ఉదయం జరిగింది. ఈ సెషన్‌లో తమిళనాడు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన విద్యార్థులతో మోదీ ప్రత్యక్షంగా సంభాషిస్తూ పరీక్షల సిద్ధత, ఒత్తిడి నిర్వహణ, స్టార్టప్‌లు, ఏఐ భవిష్యత్ వంటి అంశాలపై మార్గదర్శకత్వం అందించారు. మంచి నాయకత్వం అంటే ఎన్నికల్లో పోటీ చేయడమే కాదని, సరైన పనిని నిలకడగా చేయడమే నిజమైన లీడర్‌షిప్ అని మోదీ సూచించారు. చిన్న పనులతోనే ప్రజలను ప్రభావితం చేయవచ్చన్నారు. కనీసం 10 మందికి తన ఆలోచనలను స్పష్టంగా చెప్పగలగడమే నాయకత్వ లక్షణమని వివరించారు.

ఏఐపై భయపడాల్సిన అవసరం లేదన్నారు. దానిని అర్థం చేసుకుని మన అవసరాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. టెక్నాలజీకి బానిసలుగా మారకుండా ఉండాలని, క్రమశిక్షణ లేకుండా ప్రేరణ పనిచేయదని చెప్పారు. చిన్న స్థాయి నుంచే స్టార్టప్‌ను ప్రారంభించవచ్చన్నారు. చదువుతో పాటు వారానికి కొంత సమయం కేటాయిస్తూ ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలు, యోగా, మంచి నిద్ర కూడా అవసరమని తెలిపారు. పరీక్షల సమయంలో ఆత్మవిశ్వాసం, సమయ నిర్వహణ, సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. 2018 నుంచి కొనసాగుతున్న ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పరీక్ష భయాన్ని తగ్గించి, పరీక్షల సమయాన్ని ఉత్సవంగా మార్చడం లక్ష్యంగా కొనసాగుతోంది.

# గప్ చుప్

**ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం**

- అమల్లోకి ఎన్నికల నియామావళి
- ప్రచార కార్యక్రమాలపై నిషేధం
- 11న పోలింగ్కు ఏర్పాట్లు ముమ్మరం

**ముద్ర ప్రతినిధి - ఉమ్మడి రంగారెడ్డి జిల్లా :**

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ కీలకదశకు చేరుకున్నది. సోమవారంతో ప్రచారహోరు ముగిసింది. దీంతో బుధవారం పోలింగ్ కు రంగం సిద్ధమైంది. ఈనేపథ్యంలో ఎన్నికల సంఘం నియామవళి మేరకు సోమవారం సాయంత్రం నుండే బహిరంగ ప్రచారం, ఇతరత్రా రాజకీయ కార్యకలాపాలపై ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అన్ని రకాల చర్యలను కట్టడి చేసేందుకు ఎన్నికల యంత్రాంగం రంగంలోకి దిగనుంది. ఈమేరకు బుధవారం జరిగే మున్సిపల్ ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల నియామవళి సోమవారం సాయంత్రం నుంచే పక్కాగా అమలు చేసేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపడుతోంది. జిల్లాలో ఆమన్ గల్, చేవెళ్ళ, ఇబ్రహీంపట్నం, షాద్నగర్, మొయినాబాద్, శంకర్ పల్లి మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 11న పోలింగ్కు పూర్తి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. మరోవైపు ఎన్నికలలో అక్రమాలు, ప్రలోభాలకు చెక్ పెట్టేందుకు సోమవారంసాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వచ్చింది. మున్సిపల్ ఎన్నికలు ముగిసేంత వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. 48గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు ఎన్నికల నియామవళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీల పరిధిలోని పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉంటూ కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.

**9న, 11న, 13న మద్యం, కల్లు దుకాణాలు బంద్..**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు.

**10న, 11న విద్యాసంస్థలకు సెలవు**

ఎన్నికలు జరిగే మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు ఈ నెల 10వ తేదీన సెలవు ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. అలాగే పోలింగ్ రోజు ఈనెల 11వ తేదీన ఎన్నికలు జరిగే మున్సిపాలిటీల పరిధిలో అన్ని ప్రవేటు, ప్రభుత్వ విద్యా సంస్థలు, కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్ సంస్థలు , వాణిజ్య సంస్థలకు సెలవును ప్రకటించామని వెల్లడించారు. దీంతో ఆయా సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు తప్పనిసరిగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు.

# క్లైమాక్స్‌కు కేటీఆర్ కథ



- సిరిసిల్లలో బీఆర్ఎస్ కు పరాభావం తప్పదు
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణలో కేటీఆర్ కథ క్లైమాక్స్‌కు చేరిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు. నువ్వెంత గింజుకున్నా సిరిసిల్లలో నీకు ఎండ్ కార్డు వేస్తున్నామని సెటైర్లు వేశారు. సోమవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో ఓటర్లు బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించబోతున్నారని జోస్యం చెప్పారు. సొంత నియోజకవర్గంలో కాళ్ల కింద భూమి కదిలిపోవడంతో కేటీఆర్ కుతకుత ఉడికిపోతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయ భవిష్యత్తు గల్లంతు అవుతుందన్న భయంతో సీఎం పైన నోరు పారేసుకుంటున్నారని విమర్శించారు. అసహనంతో నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ అసలు నువ్వు ఎవరు..? తెలంగాణ ఉద్యమంలో నీ పాత్ర ఎంత? అని ప్రశ్నించారు. కేకే మహేందర్ రెడ్డి లాంటి ఉద్యమకారుడి గొంతుకోసి సిరిసిల్ల సీటు సంపాదించారని ఆరోపించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పదేళ్లు ఎన్నో నీచపు పనులు చేశాడన్న బల్మూరి..... పాస్ పోర్టు బ్రోకర్లు ఎవరో తెలంగాణ ప్రజలకు తెలుసు అని ఆరోపించారు. పదేళ్లు ఎవరు బ్రోకర్ పనులు, బేకారు పనులు చేశారో చిన్న పిల్లలను అడిగినా చెబుతారని పేర్కొన్నారు.





# 11 తర్వాత మీ సంగతి తేలుస్తా

- కారుకూతలు కూస్తే బొక్కలోకి పంపుతా
- ఏదులాపురం ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి

**ముద్ర, ఖమ్మం:**

ఈ నెల 11న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ పూర్తయిన వెంటనే హద్దులు దాటిన ప్రతి ఒక్కరి లెక్క తేలుస్తానని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యర్థులను హెచ్చరించారు. సోమవారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. రాజకీయాల ముసుగులో అరాచకాలు చేస్తామన్నా.. ఫోన్లలో బెదిరింపులకు దిగినా సహించేది లేదని స్పష్టం చేశారు. తింగరి వేషాలు వేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. చట్టప్రకారం బొక్కలో వేయించడం ఖాయమన్నారు. ఎవరైనా కారుకూతలు కూస్తే చట్టరీత్యా ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. మీ దందాలు, దౌర్జన్యాలకు ప్రజలు ఈ ఎన్నికలతో ఫుల్ స్టాప్ పెట్టబోతున్నారని జోస్యం చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగాలని ఆకాంక్షించారు. అశాంతి సృష్టించాలని చూస్తే సహించబోమని స్పష్టం చేశారు. అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వ సాయం ఉండాలనీ, అధికారంలో ఉన్న తామే ఆ పనులు చేయగలమని చెప్పారు. ఏ అధికారం ఉందని మీరు మేలు చేస్తామంటూ ప్రజల వద్దకు వస్తున్నారని ప్రత్యర్థులను నిలదీశారు. పదేళ్లు అధికారంలో ఉన్న ఆ 'దొర'లకు పేదలకు ఇల్లు ఇవ్వాలనే జ్ఞానం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్త రేషన్ కార్డులు, హాస్టల్ విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు వంటి ఎన్నో సంక్షేమ ఫలాలను అందించామని గుర్తుచేశారు. ఏప్రిల్ నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేపడతామని ప్రకటించారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇచ్చే బాధ్యత తనదేనన్నారు. ఏదులాపురాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మున్నేరు వరద బాధితులకు అండగా ఉన్నామన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి రిటైనింగ్ వాల్ పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

**ముద్ర, తాండూర్ :**

తాండూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 30 వార్డుల్లో విజయం సాధిస్తుందని తాండూర్ శాసనసభ్యులు మనోహర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామని, వచ్చే మూడేళ్లలో తాండూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. గత పాలకుల హయాంలో పాత తాండూర్ రైల్వే బ్రిడ్జ్, చిలుక వాగు, గొల్ల చెరువు వంటి కీలక పనులు అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. 2028 నాటికి తాండూర్ అభివృద్ధిని పూర్తిస్థాయిలో సాధించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్న ఎమ్మెల్యే, రూ. 550 కోట్లతో అండర్ డ్రైనేజ్ వ్యవస్థను నిర్మిస్తామని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం చైర్మన్ అభ్యర్థిని ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ అధ్యక్షులు ధారాసింగ్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు మురళీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చెల్లని నోట్లు ఇస్తారు.. జాగ్రత్త

- కాంగ్రెస్ ఓటు కోసం తెగిస్తుంది
- వాళ్లు డబ్బులిచ్చినా కారు గుర్తుకే ఓటేయండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ముద్ర, పరకాల:**



మున్సిపల్ ఎన్నికల్లో ఓటు కోసం కాంగ్రెస్ నేతలు చెల్లని రూ. 2వేల నోట్లు ఇస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చే డబ్బులు తీసుకొని బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పరకాల పట్టణంలో బస్టాండ్ కూడలి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్ అని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల రేవంత్ రెడ్డి నెరవేర్చలేరని ఆరోపించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఎన్నికలకు ముందు ప్రజలకు ఆరు గ్యారెంటీ ల బాండ్ పేపరు రాసిచ్చి, వాటిని అమలు చేయలేక విఫలమయ్యారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకుల చొక్కా పట్టుకుని అడగాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెల్లారి లేస్తే రేవంత్ రెడ్డి కేసీఆర్ ను తిట్టడమే తప్ప చేసిందేమి లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కొరవడిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. రేవంత్ రెడ్డిని నమ్మిన ప్రజలను నట్టేట ముంచారన్నారు. అన్న వస్త్రం కోసం వస్తే ఉన్న వస్త్రం పోయిన చందంగా మార్పు అన్న ప్రజలు ఆగమయ్యారని చెప్పారు. ఏ హామీని నెరవేర్చని కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో ఓటు ఎందుకు వేయాలని రేవూరి ప్రకాష్ రెడ్డిని ఆడబిడ్డలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

# అస్సాం సీఎంపై చర్యలు తీసుకోండి

- ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తున్న హిమంత బిశ్వ శర్మ
- హైదరాబాద్ సీపీకి అసదుద్దీన్ ఒవైసీ ఫిర్యాదు

**ముద్ర, హైదరాబాద్:**



అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సోమవారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ముస్లింల మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా, రెండు వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంచేలా సీఎం శర్మ వ్యవహరిస్తున్నారని ఒవైసీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హిమంత బిశ్వ శర్మ కొన్నేళ్లుగా సోషల్ మీడియా, పత్రికలు, బహిరంగ సభల ద్వారా ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ఇవి మరింత తీవ్రమయ్యాయ న్నారు. ఈ నెల 7న అస్సాం బీజేపీ అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసిన వీడియోను ఒవైసీ తన ఫిర్యాదులో ప్రస్తావించారు. అందులో ముఖ్యమంత్రి శర్మ తుపాకీ పట్టుకుని, ముస్లింలుగా చిత్రీకరించబడిన వ్యక్తులపై గురిపెట్టి కాల్పులు జరుపుతున్నట్లు ఉందని పేర్కొన్నారు. "పాయింట్ బ్లాంక్ షాట్", "నో మెర్సీ" (కరుణ లేదు) వంటి పదజాలంతో కూడిన ఆ వీడియో మత ఘర్షణలను ప్రేరేపించేలా ఉందని విమర్శించారు. ద్వేషపూరిత ప్రసంగాల విషయంలో పోలీసులు స్వచ్ఛందంగా చర్యలు తీసుకోవాలని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఒవైసీ గుర్తుచేశారు. ఈ వీడియో జాతీయ సమగ్రతకు భంగం కలిగించేలా ఉందని ఆయన వాదించారు. దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ వీడియో ముస్లింల మనోభావాలను కించపరిచేలా ఉందన్నారు. తక్షణమే సీఎం హిమంత బిశ్వ శర్మపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఒవైసీ పోలీస్ కమిషనర్‌ను కోరారు.

# కోటి రూపాయలతో అభివృద్ధి పనులు

**ముద్ర, మల్కాజిగిరి :**

మల్కాజిగిరి డివిజన్ పరిధిలో రూ. కోటి వ్యయంతో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శ్రావణ్ సోమవారం శంకుస్థాపన చేశారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ పార్క్‌లో రూ. 10లక్షల వ్యయంతో వాలీబాల్ కోర్టు, భ్రమరాంబికానగర్, విష్ణుపురి ప్రాంతాల్లో రూ. 25లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు, సర్దార్ పటేల్ నగర్‌లోని హిందూ స్మశానవాటిక అభివృద్ధికి రూ. 60లక్షలతో పలు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. స్మశాన వాటికను మోడల్ గ్రేవ్‌యార్డ్‌గా అభివృద్ధి చేసేందుకు అదనంగా మరో రూ. కోటి నిధుల ప్రతిపాదనలు పంపాలని అధికారులను కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సునీల్ యాదవ్, నందు యాదవ్, మాధవ్, మురళి గౌడ్, జోగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో ‘చిగురు’టాకులకు గర్భశోకం

- టీనేజీలోనే తల్లులవుతున్నారు..
- టీనేజీ గర్భాల సంఖ్యపై ఆందోళన!

**ముద్ర న్యూస్:**

ఆటపాటలతో గడపాల్సిన వయసులో.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో ఆ పసి ప్రాణాలు జోల పాడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో టీనేజీ ప్రెగ్నెన్సీలు (బాల్య గర్భాలు) ప్రమాదకర స్థాయికి చేరుకున్నట్లు తాజా గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. 202526 పాపులేషన్ మేనేజ్‌మెంట్ సర్వే ప్రకారం రాష్ట్ర సగటు 8.8 శాతంగా నమోదవ్వడం గమనార్హం.

**కుప్పం టాప్..**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ వెల్లడించిన వివరాల ప్రకారం నియోజకవర్గాల వారీగా చూస్తే కుప్పంలో అత్యధికంగా 14.9 శాతం టీనేజీ ప్రెగ్నెన్సీలు నమోదయ్యాయి.

రెడ్ జోన్ (12% పైగా): నెల్లూరు, పల్నాడు, ప్రకాశం, అనంతపురం, బాపట్ల, కర్నూలు.

ఆరెంజ్ జోన్ (1012%): ఏలూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, సత్యసాయి, నంద్యాల.

అత్యల్పం: విశాఖపట్నం జిల్లాలో కేవలం 3.98 శాతంతో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది.

**టీనేజ్ లో గర్భం దాల్చడం వల్ల కలిగే అనర్థాలు..:**

తల్లుల మరణాలు: శారీరక పరిణతి లేకపోవడం వల్ల కాన్పు సమయంలో తల్లులు మరణించే ప్రమాదం ఎక్కువ.

నెలలు నిండకుండానే కాన్పు: శిశువులు పూర్తి కాలం గర్భంలో ఉండకుండానే జన్మించడం వల్ల శారీరక లోపాలు తలెత్తవచ్చు.

తక్కువ బరువు: పుట్టిన పిల్లలు అత్యల్ప బరువుతో పుట్టడం, వారిలో శ్వాసకోశ ఇబ్బందులు కలగడం సర్వసాధారణం.

తీవ్ర రక్తపోటు: గర్భిణిగా ఉన్న సమయంలో రక్తపోటు పెరిగి ప్రాణాపాయ స్థితికి చేరుకునే అవకాశం ఉంది.

**ప్రభుత్వ లక్ష్యం: 5 శాతమే టార్గెట్!**

రాష్ట్రంలో నెలకొన్న ఈ క్లిష్ట పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రభుత్వం 202627 సంవత్సరానికి కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. టీనేజీ ప్రెగ్నెన్సీలను 5 శాతానికి తగ్గించడమే ధ్యేయంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ఆశా వర్కర్ల ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించనున్నారు. కాగా పిల్లలకు పెళ్లిళ్లు చేస్తే బాధ్యత తీరిపోయింది అనుకుంటే పొరపాటని ఆరోగ్య నిపుణుల హెచ్చరిస్తున్నారు.

## పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా కేటాయింపు

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్, జనరల్ అబ్జర్వర్ జి. రవిల సమక్షంలో సోమవారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న వికారాబాద్, తాండూర్, కొడంగల్, పరిగి మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ సుధీర్, డిఇ ఓ రేణుకా దేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
10.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఆరోగ్యానికి మేలు చేసే టాప్ 10 పండ్లు

పుచ్చకాయ
శరీరానికి తేమను అందిస్తుంది. వేసవిలో డీహైడ్రేషన్‌ను నివారిస్తుంది.



# అసాధ్యమైన హామీలకు మోసపోవద్దు

**ముద్ర, తాండూర్ :**

ప్రజా సేవ చేయాలనే ఉద్దేశంతో మాత్రమే రాజకీయాల్లోకి రావాలి తప్ప బంపర్ ఆఫర్లతో ప్రజలను మోసం చేయొద్దని 13వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి రాములు నాయక్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 13వ వార్డులో బి ఆర్ఎస్ అభ్యర్థి సురేష్ నాయక్ ఓడిపోతారని ఉద్దేశంతో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విట్టల్ నాయక్ ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తనకున్న సంస్థలలో 50% రాయితీ కల్పిస్తానని చెబుతున్నారని అన్నారు. ఇటువంటి బూటకపు మాటలకు ఎవరు కూడా మోసపోవద్దన్నారు. ఎంతోమంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పీఎఫ్ డబ్బులు చెల్లించకుండా, వారి డబ్బులతోటే వ్యాపారాలు చేస్తున్నా సంగతి తాండూర్ నియోజకవర్గ ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. ఏమైనా ఉంటే అభివృద్ధిలో పోటీపడి గెలవాలి తప్ప ప్రజలను తప్పుదోవ పట్టించొద్దన్నారు. ఏది ఏమైనా 13వ వార్డు ప్రజలపై తనకు పూర్తి నమ్మకం ఉందని, కాంగ్రెస్ పార్టీకి అత్యధిక ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తారని అన్నారు.

# పతంగి మరో బాలుడి ప్రాణాన్ని బలిగొంది

**ముద్ర, బండ్లగూడ :**



పతంగి మరో బాలుని ప్రాణాలను బలిగొంది. ఈ సంఘటన మైలార్దేవ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన మహేందర్ సుజాత దంపతులకు కుమారుడు ఉన్నాడు. వీరు కొద్ది సంవత్సరాల క్రితం జీవనోపాధికై నగరంలోని మైలార్ దేవ్ పల్లికి వచ్చారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధి లోని సాయిబాబా నగర్లో బిల్డింగ్ పైన హేమంత్(10) పతంగి ఎగరవేస్తున్నాడు. ఆ సమయంలో కాళ్లు జారి పై నుండి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలకు గురైన బాలుడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకోని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాలుడికి ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు,

# 12వ వార్డులో బీజేపీకి పెరుగుతున్న ఆదరణ

**ముద్ర, తాండూర్ :**

తాండూర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో బీజేపీ అభ్యర్థి రజినీకాంత్ కు ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. వార్డు ప్రజలతోపాటు మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల ప్రజలకు పరిచయమైన వ్యక్తిగా, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే నాయకుడిగా ఆయనకు విశేష గుర్తింపు ఉంది. గత మున్సిపల్ ఎన్నికల్లో ఆయన సతీమణి పూజ కౌన్సిలర్‌గా గెలుపొందగా, ఆమె హయాంలో వార్డులో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. కుంటాకు సమీపంలోని ఈ వార్డులో చిన్న వర్షానికే రోడ్లపైకి నీరు చేరడం, అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థ వంటి సమస్యలు తీవ్రంగా ఉండేవి. వాటికి పరిష్కారంగా సీసీ రోడ్ల నిర్మాణం, మురుగు కాల్వల అభివృద్ధి, వీధిదీపాల ఏర్పాటు, తాగునీటి సమస్య పరిష్కారం వంటి పనులను అంచెలంచెలుగా చేపట్టి కాలనీలో మార్పు తీసుకొచ్చారు. ఈసారి బీసీ జనరల్ స్థానం రావడంతో స్వయంగా రజినీకాంత్ ఎన్నికల బరిలోకి దిగారు.

# 13వ వార్డు ప్రజలకు బంపర్ ఆఫర్ ప్రకటించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్

**ముద్ర, తాండూర్ :**

వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరింది. బిఆర్ఎస్ అభ్యర్థి సురేష్ నాయక్ కు మద్దతుగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విట్టల్ నాయక్ తనకున్న సంస్థలలో వార్డు ప్రజల కోసం 50శాతం రాయితీ కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 13 వార్డు ప్రజలు పెళ్లిళ్లకోసం వినాయక కన్వెన్షన్ హాల్లో, వినాయక హాస్పిటల్లో, వినాయక నర్సింగ్ కళాశాలలో, వినాయక అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల్లో 13వ వార్డు ప్రజలకు 50శాతం రాయితీ కల్పిస్తానని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని, వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కారు గుర్తుకు ఓటు వేసి సురేష్ నాయక్ ను గెలిపించాలని ఆయన కోరారు. వార్డులో ఇద్దరూ హేమా హేమీల మధ్య జరుగుతున్న పోటీలో 13వ వార్డు మున్సిపల్ పరిధిలోనే అదృష్టవంతమైన వార్డ్ గా ప్రజలు చెప్పుకుంటున్నారు.

# గౌతమ్ నగర్ సమగ్ర అభివృద్ధికి కృషి

**ముద్ర మల్కాజిగిరి :**

గౌతమ్ నగర్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేశామని ఆ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతరామ్ యాదవ్ పేర్కొన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్ సాయిబాబా ఆలయం సమీపంలో రూ. 21లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె సోమవారం ప్రారంభించారు ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ రివిజన్ సమాగ్రాభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ దివ్య జ్యోతి, బిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల ఏర్పాట్లపై క్షేత్రస్థాయి తనిఖీలు

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

వికారాబాద్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సంబంధించి సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ కోసం పట్టణంలోని మేరీ నాట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ సోమవారం సందర్శించారు. అక్కడ అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించిన ఆయన, తాగునీరు, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన సదుపాయం, షామియానాలు తదితర అన్ని మౌలిక వసతులు సమగ్రంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి సామాగ్రి పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు, గందరగోళం లేకుండా చెక్‌లిస్ట్ ఆధారంగా జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ సామాగ్రి, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ల తరలింపులో సాయుధ పోలీసులతో బందోబస్తు తప్పనిసరిగా ఉండాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. సిబ్బంది సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా పర్యవేక్షణ చేపట్టాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పూర్తి స్థాయిలో వసతులు అందుబాటులో ఉంచాలని సూచించారు.

# హోరు ముగిసింది.. పోరు మిగిలింది

- **హోరు ముగిసింది.. పోరు మిగిలింది**
- **మున్సిపాలిటీ ఎన్నికలకు కౌంట్ డౌన్ మొదలు.. రేపే పోలింగ్**
- **పోలింగ్ నిర్వహణ ఏర్పాట్ల పై ఎన్నికల అధికారుల కసరత్తు**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**



మున్సిపల్ ఎన్నికల ప్రచార హోరు సోమవారం సాయంత్రానికి ముగిసింది. మైకుల హోరు, ఒకరి పై ఒకరు చేసుకున్న దూషణలకు ఒక్కసారిగా పులిస్టాప్ పడింది. ఎన్నికల ప్రచారం పట్టణాల్లో రణరంగాన్ని తలపించాయి. కాలనీల్లో మైకుల శబ్దానికి ఇళ్లల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండలేక పోయారు. విద్యార్థుల చదువుకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. నిమిషం కూడా హోరు శబ్దం ఆగకుండా రావడంతో ప్రజలు ఉక్కిబిక్కిరయ్యారు. వారంపాటు ఎన్నో ఇబ్బందులు పడిన ప్రజలకు సోమవారం సాయంత్రంతో ఉపశమనం దక్కింది.ఉమ్మడి జిల్లాలో మహబూబ్ నగర్ ఒక్కటే కార్పొరేషన్ గా మారడంతో మేయర్ పదవి దక్కించుకునేందుకు అన్ని పార్టీల నేతలు వారం రోజులుగా పట్టణంలోనే తిష్ట వేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికల నోటిఫికేషన్ కు ముందు గానే సీఎం రేవంత్ రెడ్డి అడ్వాన్స్ గా మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టారు.తరువాత ఎన్నికల ప్రచారంలో ఇంచార్జి మంత్రి దామోదర రాజానర్సింహా ప్రచారం చేసివెళ్లారు. వారంపాటు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, పార్టీ ఢిల్లీ అధికార ప్రతినిధి జితేందర్ రెడ్డి, నేతలు మిథున్ రెడ్డి, ఓబేదుల్లా కొత్వాల్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పాలమూరు లో ప్రచారం చేపట్టారు. బీఆర్ఎస్ తరపున మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఒక్కరే ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్, ఎంపీ డీకే అరుణ ప్రచారం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో నాగర్ కర్నూల్, కొల్లాపూర్ మున్సిపాలిటీలలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం చేపట్టారు. మక్తల్, ఆత్మకూర్ మున్సిపాలిటీ లలో మంత్రి వాకిటి శ్రీహరి కాంగ్రెస్ అభ్యర్థుల కోసం వారంపాటు అక్కడే ఉండి ప్రచారం లో పాల్గొన్నారు. ఆయా మున్సిపాలిటీ లలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తమ, తమ పార్టీ అభ్యర్థుల కోసం ప్రచారం చేపట్టారు. పోలింగ్ బుధవారం ఉండడంతో సోమవారం సాయంత్రానికి ప్రచార సమయం ముగియడంతో నేతలు ప్రచారం ముగించుకొని ఇళ్లకు చేరుకున్నారు. అభ్యర్థులు మాత్రం ఓటర్ల ను ప్రసన్నం చేసుకునేందుకు ఇంటింటికి వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్తోపాటు సమీపలోని భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లో ఈ రెండు మున్సిపాలిటీ లలోకలిపి 2లక్షల 19వేల989 మంది ఓటర్లు ఉన్నారు. 82వార్డులు, 320 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ రోజు నఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా అన్ని జాగ్రత్త లు తీసుకుంటున్నామని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి విజయంద్ర బోయి పేర్కొన్నారు.

# నార్సింగ్ చౌరస్తాలో.. పార్కును కాపాడిన హైడ్రా

- **రూ. 60 కోట్ల విలువైన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్**

**ముద్ర, హైదరాబాద్/బండ్లగూడ :**




గండిపేట మండలం నార్సింగ్ గ్రామ పరిధిలోని అరుణోదయ హౌసింగ్ సొసైటీలో ఉన్న పార్కు భూమిని అక్రమ కబ్జాల నుంచి సోమవారం హైడ్రా పరిరక్షించింది. నార్సింగ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సమీపంలోని ఈ కాలనీలో హుడా అనుమతితో రూపొందించిన లేఅవుట్‌లో మొత్తం 6,078 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. ఈ పార్కు భూమిపై కొంతకాలంగా అక్రమ కబ్జాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సుమారు 3వేల గజాల మేర అక్రమ నిర్మాణాలు ఏర్పడగా, మిగిలిన పార్కు స్థలంలోనూ స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి సుమారు 1,600 గజాలను కబ్జా చేసి ప్రీకాస్ట్ ప్రహరీ నిర్మించి, లోపల తాత్కాలిక షెడ్డులు ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. గతంలో నార్సింగ్ మున్సిపాలిటీ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను తొలగించినప్పటికీ, కబ్జాలు కొనసాగుతూనే ఉన్నాయి. నార్సింగ్ మున్సిపాలిటీ జీహెచ్ఎంసీలో విలీన ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ఇదే అదనుగా భావించిన కబ్జాదారు మళ్లీ స్థలాన్ని ఆక్రమించడంతో స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు రెవెన్యూ, మున్సిపల్ శాఖలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ భూమి పూర్తిగా పార్కు స్థలంగానే కేటాయించబడినదని నిర్ధారించారు. దీంతో సోమవారం హైడ్రా అధికారులు మిగిలిన సుమారు 3వేల గజాల పార్కు భూమిని స్వాధీనం చేసుకుని రక్షణ చర్యలు చేపట్టారు. పార్కు హద్దులను స్పష్టంగా నిర్ధారించి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, ఇది పార్కు కోసం కేటాయించిన స్థలమని సూచించే బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. ఈ భూమి విలువ సుమారు రూ.60 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



# మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సిబ్బంది కేటాయింపు

- **మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి**

**ముద్ర ప్రతినిధి - ఉమ్మడిరంగారెడ్డి జిల్లా :**

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం పోలింగ్ సిబ్బంది మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు మాయాంక మిట్టల్, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమక్షంలో పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ఈ ప్రక్రియను చేపట్టారు. జిల్లాలో ఎన్నికలు జరుగనున్న ఆరు మున్సిపాలిటీలకు సంబంధించి పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, కౌంటింగ్ సిబ్బందిని, మైక్రో అబ్జర్వర్స్ ను మూడవ ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఎవరైనా విధులకు గైర్హాజరు అయినట్లయితే ఎన్నికల నిబంధనలను అనుసరించి కఠిన చర్యలు తీసుకోబడుతాయని కలెక్టర్ హెచ్చరించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో డీపిఓ సురేష్ మోహన్, జీఎం డి.ఐ.సి. శ్రీలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యం

- **వనపర్తి కార్నర్ మీటింగ్‌లో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**ముద్ర, వనపర్తి :**



వనపర్తి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తేనే అభివృద్ధి జోరుగా సాగుతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార చివరి రోజు సోమవారం వనపర్తి పట్టణంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పార్టీ నేత స్వామి గౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయంగా అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణకు ముందు కేవలం 14 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందగా, తెలంగాణ ఏర్పాటయ్యాక కోటి 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పరిశ్రమల స్థాపన ద్వారా 16 లక్షల ఉద్యోగాలు, ఐటీ అభివృద్ధితో మరో 19 లక్షల ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. తెలంగాణ నుంచి వలసలు తగ్గిపోయి, ఇతర రాష్ట్రాల ప్రజలు తెలంగాణ వైపు వచ్చారని అన్నారు. నపర్తిలో 3,420 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించామని తెలిపారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను నట్టేట ముంచిందని ఆరోపించారు. యూరియా బస్తా కోసం క్యూ కట్టే దుస్థితిని తీసుకొచ్చిందని, విద్యార్థినులకు స్కూటీలు రాకపోవడం, యువతకు ఉద్యోగాలు రాకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మరోసారి మోసపోతారని, ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో 31మంది బీఆర్ఎస్ అభ్యర్థులు, ఇద్దరు సీపీఐ(ఎం) అభ్యర్థులు, అలాగే నాయకులు యాదవ్, లక్ష్మయ్య, శ్రీధర్, రమేష్ గౌడ్, అశోక్, గంధం బాలపీరు, వేణుగోపాల్, గులాం ఖాదర్ ఖాన్, బొబ్బిలి ప్రేమ్ కుమార్, సయ్యద్ జమీల్, సూర్యవంశం గిరి, జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము, మాజీ ప్రజాప్రతినిధులు కృష్ణా నాయక్, జగదీశ్వర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, అమ్మపల్లి శ్రీనివాస్ రెడ్డి, భీమన్న, మధుసూదన్ రెడ్డి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి లయన్స్ క్లబ్ సాయం

**ముద్ర, కుత్బుల్లాపూర్ :**

ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లనున్న పేద విద్యార్థికి లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆర్థిక సాయం అందించింది. ఈ మొత్తాన్ని టీఆర్ఎస్ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద సోమవారం తన కార్యాలయంలో విద్యార్థికి అందజేశారు. సూరారం కాలనీ 60గజాల ప్రాంతానికి చెందిన శ్రీపతి ఉదయ్ కుమార్‌కు ఆస్ట్రేలియాలో మైక్రోబయాలజీలో పీజీ చదివే అవకాశం లభించింది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోవడంతో అవసరమైన ఖర్చుల కోసం ఆయన ఎమ్మెల్యే వివేకానందను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లయన్స్ క్లబ్ సభ్యులను సంప్రదించి సహకారం అందించాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించిన లయన్స్ క్లబ్ సభ్యులు రెండు రోజుల్లోనే రూ.1.30లక్షల ఆర్థిక సాయాన్ని సమకూర్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షుడు బిర్రు ఆంజనేయులు, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ విజయ్‌కుమార్ శెట్టి, సీనియర్ సభ్యులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, కోలా వెంకటేష్ ముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహులు గౌడ్, బాలరాజు, ప్రవీణ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మైనర్‌పై లైంగిక దాడి కేసులో కీలక తీర్పు

- **నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష**
- **రూ.20వేల జరిమానా : ఎస్పీ స్నేహ మెహ్రా**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



వికారాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించిన మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ వికారాబాద్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా వెల్లడించారు. 2023లో వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్ 150/2023 ప్రకారం, వికారాబాద్ మండలానికి చెందిన అత్వెల్లి నరేందర్ (అలియాస్ నరేష్) అనే వ్యక్తి మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఘటనపై పోలీసులు పోక్సో చట్టం సహా సంబంధిత ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు విచారణ వికారాబాద్‌లోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో న్యాయమూర్తి చంద్ర కిషోర్ సమక్షంలో జరిగింది. పోలీసులు సమర్పించిన శాస్త్రీయ సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు, నిందితుడిపై నేరం రుజువైనట్లు నిర్ధారించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. అలాగే బాధితురాలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పరంగా రూ.5 లక్షల నష్టపరిహారం అందజేయాలని ఆదేశించింది. ఈ కేసులో నిందితుడికి కఠిన శిక్ష పడేలా పకడ్బందీగా వ్యవహరించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ స్నేహ మెహ్రా అభినందించారు. ఈసందర్భంగా మహిళలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని ఆమె స్పష్టం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
10.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఆరోగ్యానికి మేలు చేసే టాప్ 10 పండ్లు**

ద్రాక్ష
యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వృద్ధాప్య ప్రభావాన్ని తగ్గిస్తాయి.







# ఇటలీపై స్కాట్లాండ్ విజృంభణ..

- **73 పరుగుల తేడాతో ఘన విజయం**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్ :**

టీ20 ప్రపంచకప్-2026లో భాగంగా ఇటలీతో జరిగిన కీలక మ్యాచ్‌లో స్కాట్లాండ్ ఏకపక్ష ఆధిపత్యం ప్రదర్శించింది. 208 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇటలీ జట్టు 16.4 ఓవర్లలోనే 134 పరుగులకు కుప్పకూలి, 73 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. బ్యాటింగ్‌లో బెన్ మనెంటి అర్ధశతకం నమోదు చేసి పోరాటం చేశాడు. హెన్రీ మనెంటి, స్మట్స్ కొంతమేర తోడ్పాటు అందించినప్పటికీ జట్టును గెలిపించలేకపోయారు.

స్కాట్లాండ్ బౌలర్లు కీలక సమయంలో వికెట్లు తీస్తూ మ్యాచ్‌ను తమవైపు తిప్పుకున్నారు. మైకెల్ లీస్క్ నాలుగు వికెట్లు పడగొట్టి ఇటలీ పతనానికి కారణమయ్యాడు. మార్క్ వాట్ రెండు వికెట్లు సాధించగా, బ్రాడ్ క్యూరీ, బ్రాడ్ వీల్, డేవిడ్సన్ చెరో వికెట్‌తో సహకరించారు. 12 ఓవర్లకు 113/3 స్కోరుతో ఆశాజనకంగా కనిపించిన ఇటలీ, ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి కేవలం 21 పరుగుల వ్యవధిలో చివరి ఆరు వికెట్లు కోల్పోయింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు నమోదు చేసింది. ఓపెనర్ జార్జ్ మున్సే అద్భుత హాఫ్ సెంచరీతో జట్టును ముందుకు నడిపించాడు. మరో ఓపెనర్ మైకెల్ జోన్స్‌తో కలిసి తొలి వికెట్‌కు భారీ భాగస్వామ్యం నెలకొల్పాడు. మధ్యలో బ్రాండన్ మెక్‌ముల్లెన్ తక్కువ బంతుల్లోనే వేగంగా పరుగులు రాబట్టి స్కోరును మరింత పెంచాడు. చివరి ఓవర్లో మైకేల్ లీస్క్ మెరుపు షాట్లతో స్కోరు 200 దాటేలా చేశాడు.

ఇటలీ బౌలర్లలో అలీ హసన్, గ్రాంట్ స్టీవర్ట్, థామస్ డ్రాకా, స్మట్స్ చెరో వికెట్ సాధించినా, స్కాట్లాండ్ బ్యాటింగ్‌ను అడ్డుకోవడంలో విఫలమయ్యారు. ఈ విజయంతో స్కాట్లాండ్ టోర్నీలో తమ బలాన్ని స్పష్టంగా చాటింది.



# భారత్ మ్యాచ్‌పై పాక్ కండిషన్లు..

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

టీ20 ప్రపంచకప్-2026లో భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను ఆడబోమని పాకిస్థాన్ ప్రకటించడంతో అంతర్జాతీయ క్రికెట్‌లో ఉత్కంఠ నెలకొంది. ఈ అంశం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కీలకమైన భారత్-పాక్ పోరును ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించాలనే లక్ష్యంతో ఐసీసీ పాకిస్థాన్ క్రికెట్ బోర్డుతో చర్చలు కొనసాగిస్తోంది.

ఈ క్రమంలో లాహోర్‌లో ఆదివారం జరిగిన కీలక భేటీలో పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ, ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ ఇమ్రాన్ ఖవాజా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు అమీనుల్ ఇస్లాం పాల్గొన్నారు. ఐదు గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో ఐసీసీ ముందు పీసీబీ మూడు ప్రధాన డిమాండ్లు ఉంచినట్లు సమాచారం. బంగ్లాదేశ్‌లో క్రికెట్ అభివృద్ధికి ఐసీసీ నుంచి అదనపు ఆర్థిక సహాయం అందించాలన్నది తొలి షరతుగా చెబుతున్నారు. రెండోగా, టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనకపోయినా బంగ్లాదేశ్‌కు పార్టిసిపేషన్ ఫీజు ఇవ్వాలని డిమాండ్ చేసింది. అలాగే భవిష్యత్‌లో జరిగే ఐసీసీ టోర్నీలలో కనీసం ఒక ఈవెంట్‌కు అయినా బంగ్లాదేశ్‌కు ఆతిథ్య హక్కులు కేటాయించాలని కోరినట్లు తెలుస్తోంది.

ఈ పరిణామాల నేపథ్యంలో భారత్‌తో మ్యాచ్ ఆడే అంశంపై పాకిస్థాన్‌కు ఐసీసీ 24 గంటల గడువు విధించినట్లు సమాచారం. తుది నిర్ణయానికి ముందుగా పాకిస్థాన్ ప్రభుత్వం అభిప్రాయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ సోమవారం ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కలిసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. పాక్ తన నిర్ణయాన్ని మార్చుకుని మ్యాచ్ ఆడేందుకు సానుకూలంగా స్పందిస్తుందని ఐసీసీ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

షెడ్యూల్ ప్రకారం ఈ నెల 15న కొలంబోలో భారత్-పాక్ మ్యాచ్ జరగాల్సి ఉంది. భద్రతా కారణాలతో భారత్‌లో ఆడేందుకు బంగ్లాదేశ్ నిరాకరించడంతో ఆ జట్టును టోర్నీ నుంచి తప్పించి స్కాట్లాండ్‌కు అవకాశం ఇచ్చారు. ఈ నిర్ణయానికి నిరసనగా బంగ్లాదేశ్‌కు మద్దతుగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. ఇదిలా ఉండగా, ఐసీసీ-పీసీబీ చర్చలపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పందించారు. ఈ అంశాన్ని పూర్తిగా ఐసీసీకే అప్పగించినట్లు తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తీసుకునే ఏ నిర్ణయానికైనా భారత క్రికెట్ బోర్డు కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## టీమిండియా ఫాస్ట్ బౌలర్ ప్రపంచకప్ కల చెదిరిందా..

## హర్షిత్ రాణాకు సర్జరీ

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్ :**

టీ20 ప్రపంచకప్ 2026లో ఆడాలన్న ఆశలు నెరవేరకుండానే టీమ్‌ఇండియా ఫాస్ట్‌బౌలర్ హర్షిత్ రాణా టోర్నీకి దూరమయ్యాడు. ప్రపంచకప్‌కు ముందు సౌతాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో మోకాలి గాయం కావడంతో అతడిని జట్టులోంచి తప్పించాల్సి వచ్చింది. హర్షిత్ స్థానంలో మహ్మద్ సిరాజ్‌కు అవకాశం ఇచ్చారు.

తాజాగా హర్షిత్ రాణాకు శస్త్రచికిత్స జరిగింది. ఈ విషయాన్ని అతడే సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. ఆస్పత్రిలో ఉన్న ఫొటోను పంచుకుంటూ, సర్జరీ విజయవంతంగా పూర్తైందని, ఇకపై పూర్తిగా కోలుకోవడంపైనే దృష్టి పెట్టనున్నట్లు తెలిపాడు. మైదానంలోకి తిరిగి రావడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నానని పేర్కొన్నాడు.

ఇదిలా ఉండగా, టీ20 ప్రపంచకప్‌లో భారత్ శుభారంభం చేసింది. యూఎస్ఏతో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 29 పరుగుల తేడాతో విజయం సాధించింది. తదుపరి మ్యాచ్‌లో ఫిబ్రవరి 12న దిల్లీ వేదికగా నమీబియాతో భారత్ తలపడనుంది.





# బోణీ కొట్టిన జింబాబ్వే..

- **పసికూన ఒమన్ పై ఘన విజయం..**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

టీ20 ప్రపంచకప్ 2026లో జింబాబ్వే శుభారంభం చేసింది. కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే ఘన విజయం సాధించింది. 104 పరుగుల లక్ష్యాన్ని 13.3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది.జింబాబ్వే బ్యాటర్లలో బ్రియాన్ బెన్నెట్ (48 నాటౌట్; 36 బంతుల్లో 7 ఫోర్లు), బ్రెండన్ టేలర్ (31 రిటైర్డ్ హర్ట్; 30 బంతుల్లో 3 ఫోర్లు) రాణించారు. తడివానాషే మరుమాని (21; 11 బంతుల్లో 5 ఫోర్లు) వేగంగా ఆడాడు. ఒమన్ బౌలర్లలో సుఫ్యాన్ మెహమూద్ రెండు వికెట్లు తీశాడు. అంతక ముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఒమన్ 19.5 ఓవర్లలో 103 పరుగులకు ఆలౌటైంది. ఒమన్ బ్యాటర్లలో సుఫ్యాన్ మెహమూద్ (25), వినాయక్ శుక్లా (28), నదీమ్ ఖాన్ (20) లు మాత్రమే రెండు అంకెల స్కోరు సాధించారు.

మిగిలిన వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యారు. జింబాబ్వే బౌలర్లలో రిచర్డ్ నగరవ, బ్లెస్సింగ్ ముజరబానీ, బ్రాడ్ ఎవాన్స్ లు తలా మూడు వికెట్లు తీశారు. కెప్టెన్ సికిందర్ రజా ఓ వికెట్ పడగొట్టాడు.



# రాహుల్ శతకంతో కర్ణాటక సెమీస్‌కు..

**ముంబైపై థ్రిల్లింగ్ విక్టరీ**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్ :**



రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ మరోసారి తన క్లాస్‌ను చాటాడు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో 325 పరుగుల కఠిన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రాహుల్ అద్భుత శతకంతో కర్ణాటకను విజయం దిశగా నడిపించాడు. 182 బంతుల్లో 130 పరుగులు చేసిన రాహుల్, స్మరణ్ రవిచంద్రన్‌తో కలిసి 147 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు.రాహుల్ ఔటైన తర్వాత స్మరణ్ (83 నాటౌట్) స్థిరంగా ఆడి జట్టును గెలిపించగా, విద్యాధర్ పాటిల్ (31*) మద్దతిచ్చాడు. కర్ణాటక 6 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని చేరుకుని 4 వికెట్ల తేడాతో గెలిచి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఫిబ్రవరి 15 నుంచి జరిగే సెమీఫైనల్లో కర్ణాటక ఉత్తరాఖండ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 120 పరుగులకే కుప్పకూలగా, కర్ణాటక బౌలర్లు ప్రభావం చూపారు. అనంతరం ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 377 పరుగులు చేయడంతో లక్ష్యం భారీగా మారినా, రాహుల్ నేతృత్వంలోని కర్ణాటక బ్యాటింగ్ ఆ ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొని అద్భుత విజయం నమోదు చేసింది.

# టీ20 ప్రపంచకప్‌లో అరుదైన ఫీట్

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్ :**

టీ20 ప్రపంచకప్ గెలవడమే క్రికెటర్లకు అతి పెద్ద కల. అలాంటిది కెప్టెన్‌గా తన జట్టును రెండుసార్లు విశ్వవిజేతగా నిలబెట్టడం అరుదైన ఘనత. 2007 నుంచి 2024 వరకూ జరిగిన టీ20 ప్రపంచకప్‌ల్లో ఎంతోమంది దిగ్గజ కెప్టెన్లు పోటీపడ్డారు. భారత్, ఇంగ్లాండ్ లాంటి జట్లు రెండుసార్లు ట్రోఫీ గెలిచినా... ఆ విజయాలకు నాయకత్వం వహించిన కెప్టెన్లలో మాత్రం ఒకడే రెండు సార్లు కప్ అందుకున్నాడు. అతడే వెస్టిండీస్ మాజీ కెప్టెన్ డారెన్ సామి.

ధోనీతో మొదలైన భారత టీ20 స్వర్ణయుగం టీ20 ప్రపంచకప్ అనగానే ముందుగా గుర్తొచ్చేది 2007 ఎడిషన్. ఎంఎస్ ధోనీ సారథ్యంలో యువ భారత్ సంచలనం సృష్టించింది. సౌతాఫ్రికా వేదికగా జరిగిన ఆ టోర్నీలో పాకిస్థాన్‌ను ఫైనల్‌లో ఓడించి భారత్ తొలి సారిగా టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకుంది. ధోనీ తీసుకున్న ధైర్యమైన నిర్ణయాలు, యువ ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం భారత క్రికెట్‌కు కొత్త దిశను చూపించాయి.

రోహిత్ శర్మతో మరోసారి భారత్ ఛాంపియన్* ధోనీ తర్వాత టీ20 ప్రపంచకప్‌ను భారత్‌కు అందించిన కెప్టెన్ రోహిత్ శర్మ. 2024లో జరిగిన ఎడిషన్‌లో రోహిత్ నాయకత్వంలో టీమ్‌ఇండియా ఓటమి లేకుండా ముందుకు సాగింది. ఫైనల్‌లో సౌతాఫ్రికాను ఓడించి రెండోసారి కప్‌ను ముద్దాడింది. 2007లో ఆటగాడిగా, 2024లో కెప్టెన్‌గా ట్రోఫీ గెలిచిన ఏకైక భారత క్రికెటర్‌గా రోహిత్ ప్రత్యేక గుర్తింపు పొందాడు.

డారెన్ సామి కెప్టెన్సీలో వెస్టిండీస్ సంచలనం* టీ20 ఫార్మాట్‌లో వెస్టిండీస్ సత్తా 2012లో ప్రపంచానికి తెలిసింది. డారెన్ సామి నాయకత్వంలో కరీబియన్ జట్టు తొలి టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకుంది. శ్రీలంకలో జరిగిన ఆ టోర్నీ ఫైనల్‌లో హోస్ట్ జట్టును ఓడించి వెస్టిండీస్ చరిత్ర సృష్టించింది. సామి తన ప్రశాంత నాయకత్వంతో జట్టును ఏకతాటిపైకి తెచ్చాడు.

రెండోసారి కప్... ప్రపంచ రికార్డు 2016లో డారెన్ సామి మరోసారి చరిత్ర రాశాడు. భారత్ వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ రెండోసారి విజేతగా నిలిచింది. ఫైనల్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కార్లోస్ బ్రాత్‌వైట్ వరుస సిక్సర్లతో మ్యాచ్ తిప్పాడు. ఈ విజయంతో డారెన్ సామి టీ20 ప్రపంచకప్‌ను రెండుసార్లు గెలిచిన ఏకైక కెప్టెన్‌గా ప్రపంచ రికార్డు సృష్టించాడు. అదే ఏడాది వెస్టిండీస్ మహిళల జట్టు కూడా టీ20 ప్రపంచకప్ గెలవడం విశేషం. ఆ ఏడాది కరీబియన్ క్రికెట్‌కు స్వర్ణయుగంగా నిలిచింది.

సామి తర్వాత వెస్టిండీస్ పతనం డారెన్ సామి కెరీర్ ముగిసిన తర్వాత వెస్టిండీస్ జట్టు మునుపటి స్థాయిలో రాణించలేకపోయింది. ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నా, వారిని ఒక తాటిపై నడిపించే నాయకత్వం లోపించడంతో గత దశాబ్దంలో ఒక్కసారి కూడా టీ20 ప్రపంచకప్ గెలవలేకపోయింది.2026లో మళ్లీ ఆశల కాంతి ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచకప్ 2026లో వెస్టిండీస్ మళ్లీ పాత వైభవాన్ని సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగింది. షై హోప్ సారథ్యంలో ఉన్న ఈ జట్టు బలంగా కనిపిస్తోంది. స్క్వాడ్‌లో అనుభవం, యువశక్తి సమతుల్యంగా ఉంది. ఇప్పటికే స్కాట్లాండ్‌పై 35 పరుగుల తేడాతో గెలిచి టోర్నీని శుభారంభం చేసింది. ఈసారి వెస్టిండీస్ మరోసారి చరిత్ర సృష్టిస్తుందా అనే ఆసక్తి క్రికెట్ అభిమానుల్లో నెలకొంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
10.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## ఆరోగ్యానికి మేలు చేసే టాప్ 10 పండ్లు

బ్లూబెర్రీలు
మెదడు ఆరోగ్యానికి చాలా మంచివి.
జ్ఞాపకశక్తిని పెంపొందిస్తాయి.





# అనార్కలి డ్రెస్‌లో భాగ్యశ్రీ అదరహో

ఇటీవల విడుదలైన ఫొటోలలో భాగ్యశ్రీ అనార్కలి స్టైల్ డ్రెస్‌లో మెస్మరైజింగ్ లుక్‌తో కనిపించి అభిమానులను ఆకట్టుకుంటోంది. సాఫ్ట్‌గా ఫ్లో అయ్యే ఫాబ్రిక్‌తో రూపొందిన ఈ అవుట్‌ఫిట్ ఆమె అందానికి మరింత గ్రేస్‌ను జోడించింది. క్లాసిక్ టచ్‌తో పాటు మోడ్రన్ ఎలిగెన్స్‌ను మేళవించిన ఈ లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డ్రెస్ బాడిస్ భాగంలో చేసిన సీక్విన్, థ్రెడ్ ఎంబ్రాయిడరీ వర్క్ హద్దు మీరని మెరుపుతో లుక్‌ను రిచ్‌గా మార్చింది. స్ట్రాప్స్‌పై ఉన్న లైట్ ఎంబెలిష్‌మెంట్ మొత్తం అవుట్‌ఫిట్‌కు డెలికేట్ ఫినిష్‌ను అందిస్తూ స్టైలిష్ ఫీల్‌ను ఇచ్చింది. మొత్తంగా ఈ అనార్కలి లుక్‌లో భాగ్యశ్రీ బోల్డ్ స్టేట్‌మెంట్ కంటే క్లాసీ ఎలిగెన్స్‌కే ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది. చుట్టూ గాసిప్‌లు ఎలా ఉన్నా తన ఫ్యాషన్ ఎంపికలతోనే సమాధానం చెప్పగలదని మరోసారి నిరూపిస్తూ ఫ్యాషన్ లవర్స్ నుంచి ప్రశంసలు అందుకుంటోంది.



# బాలీవుడ్‌పై నాని ఫోకస్..

## ది ప్యారడైజ్'కు జియో స్టూడియోస్‌తో భారీ రిలీజ్ ప్లాన్

ఇటీవలి కాలంలో టాలీవుడ్ సినిమాలకు బాలీవుడ్ మార్కెట్‌లో సరైన విడుదల దక్కించుకోవడం పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా టైర్-2 హీరోల సినిమాలు అక్కడ థియేటర్లు, ప్రమోషన్ల విషయంలో ఆశించిన స్థాయిలో నిలవలేకపోతున్నాయి. అయితే నాని మాత్రం తన తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విషయంలో ఈ ట్రెండ్‌ను బ్రేక్ చేయాలనే గట్టి ప్లానింగ్‌తో ముందుకు వెళ్తున్నాడు. హిందీ బెల్ట్‌లో ఈ సినిమాను పెద్ద స్థాయిలో విడుదల చేయాలని మేకర్స్ వ్యూహం రచిస్తున్నట్లు సమాచారం. సాధారణంగా సౌత్ సినిమాల హిందీ రిలీజ్‌కు గోల్డ్ మైన్స్, పెన్ స్టూడియోస్ వంటి సంస్థలే ముందుంటాయి. కానీ ఈసారి నాని టీమ్ భిన్నమైన దారి ఎంచుకుని జియో స్టూడియోస్‌తో చేతులు కలిపే ప్రయత్నంలో ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇటీవల భారీ చి త్రాలను విజయవం తంగా విడుదల చేసిన ట్రాక్ రికార్డ్ జియో స్టూడియోస్‌కు ఉండటం 'ది ప్యారడైజ్'కు బాలీవుడ్‌లో అదనపు బలం ఇస్తుందని భావిస్తున్నారు. ఈ వారంలోనే హిందీ రిలీజ్ డీల్‌పై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ డ్రామాపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. 'దసరా'తో నార్త్ ఆడియన్స్ దృష్టిని ఆకర్షించిన నాని, ఈ సినిమాతో దేశవ్యాప్తంగా తన మార్కెట్‌ను మరింత విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. జియో స్టూడియోస్ భాగస్వామ్యం ఖరారైతే థియేటర్ల సంఖ్య, ప్రమోషన్ల విషయంలో సినిమాకు భారీ ఊతం దక్కనుంది. ప్రస్తుతం బాలీవుడ్ ప్రేక్షకులు కొత్తదనం ఉన్న సౌత్ కంటెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. సరైన టైమింగ్, బలమైన డిస్ట్రిబ్యూషన్‌తో 'ది ప్యారడైజ్' విడుదలైతే నాని నార్త్ మార్కెట్‌లో కూడా గట్టి ఇంపాక్ట్ చూపే అవకాశం ఉంది. ఈ సినిమా సక్సెస్ అయితే టాలీవుడ్ హీరోలకు బాలీవుడ్‌లో కొత్త అవకాశాల దారిని తెరిచేలా మారవచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది. అధికారిక ప్రకటన కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





## లేటెస్ట్ లుక్‌తో మళ్లీ లైమ్‌లైట్‌లోకి

# దిశా పటాని

దాదాపు ఏడాది పాటు పెద్దగా సినిమాలు లేకపోయినా, ఇప్పుడు దిశా పటాని మళ్లీ గ్లామర్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారుతోంది. 2025లో ప్రశాంతంగా గడిచిన ఆమె కెరీర్‌కు ఇప్పుడు కొత్త ఊపు వచ్చినట్టుగా కనిపిస్తోంది. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న 'ఓ రోమియో' సినిమాలో ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ సినిమాలో షాహిద్ కపూర్‌తో కలిసి పాన్ షాప్ నేపథ్యంలో వచ్చే ఓ హుషారైన డాన్స్ నంబర్‌లో దిశా కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన ఈ పాట ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఎనర్జీతో నిండిన డాన్స్ మూవ్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో దిశా మరోసారి తన గ్లామర్ పవర్‌ను చాటుతోంది. మొత్తంగా చూస్తే, దిశా పటాని ఈ పాటతోనే మళ్లీ ఫుల్ ఫామ్‌లోకి వచ్చిందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. 'ఓ రోమియో'తో ఆమెకు మరో బిగ్ హిట్ దక్కే అవకాశం ఉందన్న చర్చ కూడా మొదలైంది.

# వేలంటైన్స్ డే వీకెండ్‌పై టాలీవుడ్ ఆశలు..

- **మూడు సినిమాలతో బాక్సాఫీస్‌కు ఊపు?**

సంక్రాంతి సీజన్‌లో టాలీవుడ్ బాక్సాఫీస్ ఫుల్ జోష్‌లో కనిపించింది. ఐదు సినిమాలు విడుదలై, అందులో ఒకటి ఇండస్ట్రీ హిట్‌గా నిలవగా, రెండు చిత్రాలు సూపర్ హిట్లుగా మారాయి. ఒక సినిమా యావరేజ్‌గా ఆడినా, ఒక్కటే ఫ్లాప్ అయినా అది కూడా మోస్తరు వసూళ్లు రాబట్టింది. అయితే పండుగ సందడి ముగిసిన వెంటనే బాక్సాఫీస్ మళ్లీ నిశ్శబ్దంలోకి వెళ్లిపోయింది. ఒక వారం ఏ విడుదల లేకపోగా, తర్వాత వచ్చిన చిత్రం కూడా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. గత వీకెండ్‌లో అరడజనుకు పైగా తెలుగు సినిమాలు థియేటర్లలోకి వచ్చినా, ఏదీ ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. కొన్ని సినిమాలకు మంచి టాక్ వచ్చినా, కలెక్షన్లు మాత్రం నిరాశపరిచాయి. దీంతో టాలీవుడ్ ఇప్పుడు వచ్చే వీకెండ్‌పై ఆశలు పెట్టుకుంది.వేలంటైన్స్ డే సందర్భంగా విడుదలయ్యే మూడు చిత్రాలు బాక్సాఫీస్‌కు మళ్లీ కళ తీసుకురావచ్చన్న అంచనాలు ఉన్నాయి. అందులో విశ్వక్ సేన్ నటించిన 'ఫంకీ' ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. 'జాతి రత్నాలు' దర్శకుడు అనుదీప్ కేవీ తెరకెక్కించిన ఈ సినిమా, తన ట్రేడ్‌మార్క్ కామెడీతో ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తుందనే నమ్మకం ఉంది.అలాగే, సంతోష్ శోభన్ చాలా గ్యాప్ తర్వాత నటించిన 'కపుల్ ఫ్రెండ్లీ' కూడా ఆసక్తిని కలిగిస్తోంది. ట్రైలర్‌కు వచ్చిన స్పందన ఈ సినిమాపై అంచనాలను పెంచింది. మరోవైపు సీనియర్ హీరో అర్జున్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన 'సీతాపయనం' కూడా హృద్యమైన కథతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా కనిపిస్తోంది.మొత్తంగా చూస్తే, ఈ మూడు చిత్రాలు బలమైన కంటెంట్‌తో రావడంతో వేలంటైన్స్ డే వీకెండ్‌లో టాలీవుడ్ బాక్సాఫీస్ మళ్లీ సందడిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# వారణాసి' అనుభవం ప్రత్యేకం..

- **రాజమౌళితో పని చేయడం అరుదైన అవకాశం: ప్రియాంక చోప్రా**

రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'పై గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ మీడియాతో మాట్లాడిన ఆమె, తన సినీ కెరీర్‌లో ఈ సినిమా ఒక భిన్నమైన ప్రయాణంలా అనిపిస్తోందని వెల్లడించారు. ఇంత స్థాయి విజన్‌తో, ఇంత లోతైన కథనంతో రూపొందుతున్న చిత్రంలో భాగం కావడం తనకు ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తోందని చెప్పారు. తెలుగు భాషపై పూర్తి అవగాహన లేకపోయినా, రాజమౌళి దర్శకత్వ శైలి తనకు పెద్ద బలం అయిందని ప్రియాంక తెలిపారు. ప్రతి డైలాగ్ వెనుక ఉన్న భావాన్ని, పాత్రలో వ్యక్తమవ్వాల్సిన ఎమోషన్‌ను ఆయన ఎంతో స్పష్టంగా వివరించడంతో నటన మరింత సహజంగా వచ్చిందన్నారు. ఈ విధానం తన పెర్ఫార్మెన్స్‌కు కొత్త లోతును తీసుకొచ్చిందని ఆమె ప్రశంసలు కురిపించారు. అలాగే, ఈ చిత్రం కేవలం కథ పరంగానే కాకుండా విజువల్స్ పరంగా కూడా ప్రేక్షకులకు అద్భుత అనుభవాన్ని అందించనుందని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు ఏర్పడిన 'వారణాసి' 2027 ఏప్రిల్ 7న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోందని ప్రియాంక ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# 'గాయపడ్డ సింహం' ట్రైలర్ రిలీజ్..

- **బజ్ క్రియేట్ చేస్తున్న తరుణ్ భాస్కర్**

నూతన కథనాలతో గుర్తింపు తెచ్చుకున్న తరుణ్ భాస్కర్ నటుడిగా నటించిన తాజా చిత్రం *'గాయపడ్డ సింహం'తో మరోసారి వార్తల్లో నిలిచారు. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి కథానాయికలుగా నటించారు. పవన్ సాధినేని సమర్పణలో రూపొందిన ఈ సినిమా షూటింగ్ పూర్తిచేసుకుని తాజాగా టీజర్-ట్రైలర్ మేళవించిన *'ట్రైజర్'**ను విడుదల చేసింది. అమెరికా వెళ్లాలనే కలతో ఉన్న ఓ యువకుడి జీవితంలో వీసా రిజెక్షన్ తర్వాత చోటు చేసుకునే పరిణామాలే కథాంశం. కామెడీ, వ్యంగ్యం, యాక్షన్‌తో పాటు అమెరికా వీసా సమస్యలపై సెటైర్ ట్రైజర్‌లో ఆకట్టుకుంటోంది. డొనాల్డ్ ట్రంప్‌ను సూచించే సన్నివేశాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వేసవి కానుకగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం, నటుడిగా తరుణ్ భాస్కర్‌కు ఎలాంటి బ్రేక్ ఇస్తుందోనన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.




Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com